

దేవాదిదేవా.. శ్రీవాసుదేవా



దేవాదిదేవా.. వాసుదేవా అంటూ వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని భక్తజనం కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదో రోజైన మంగళవారం ఆలయంలోని వసంత మండపంలో ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని కన్నులారా చూసి మనసారా వేడుకున్నారు.. మంగళవారం రాత్రి మలయప్ప అలంకరణలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు.. 6



మార్కెట్లోకి కల్తీ మద్యం తెచ్చింది జగనే

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మద్యం విషయంలో పారదర్శకంగా పనిచేస్తుంటే వైసీపీ నాయకులు బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యపాన నిషేధం విధిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరిచారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కల్తీ మద్యం కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నవోదయం 2.0 ద్వారా నాటుసారాను పూర్తిగా నిర్మూలించామన్నారు. దాదాపు 21 జిల్లాలు నాటుసారా రహిత జిల్లాలుగా మార్చామని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో తప్పుడు పనులు చేసేవారిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లితే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

మద్యం దుకాణాలపై నిరంతర నిఘా

సూపరింటెండెంట్ లావణ్య

రాజమహేంద్రవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం తయారీ, రవాణా, అనుమతి లేని మద్యం విక్రయాలపై పటిష్ట నిఘా పెట్టామని.. నిరంతర దాడులు చేస్తున్నామని జిల్లా ఎక్సయిజ్ సూపరింటెండెంట్ సీహెచ్.లావణ్య పేర్కొన్నారు.నకిలీ మద్యం అరికట్టాలంటూ వైసీపీ నాయకులు వివిధ ఎక్సయిజ్ స్టేషన్లకు వెళ్లి వినతి పత్రాలు అందజేయడంపై ఆమె స్పందించారు. జిల్లాలోని 7 ఎక్సయిజ్, ఈఎస్ టాస్క్ ఫోర్స్ ఎన్ఫోర్స్‌మెంట్ టీమ్‌లు సమన్వయంతో అన్ని ప్రాంతాల్లో క్రమం తప్ప కుండా తనిఖీలు చేస్తున్నాయన్నారు. 138 మద్యం దుకాణాలు, 20 బార్లలో నాణ్యత తనిఖీలు ఎక్సయిజ్ నిరంతరం జరుగుతున్నాయన్నారు. గతేడాది అక్టోబరు 16 నుంచి ఇప్పటి వరకూ 574 నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించామని, ఎలాంటి కల్తీ మద్యం ఆనవాళ్లు లభించలేదన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్ మూతపై ఉన్న సీల్‌ను స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఎక్కడైనా నకిలీ మద్యం ఆనవాళ్లు ఉంటే వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 14405కి సమాచారం చేరవేయాలన్నారు. అవసరమైతే సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



రాష్ట్రంలో నాలుగు చోట్ల క్రీడా స్టేడియంలు నిర్మిస్తాం

శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్

దేవరపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగుచోట్ల క్రీడా స్టేడియంలు ఏర్పాటు చేస్తామని శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. దేవరపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుప్పం, విజయనగరం, పాయకరావుపేటల్లో క్రీడా స్టేడియంలు ఏర్పాటు చేస్తామన్నారు. కడపలో ఉన్న క్రీడాస్టేడియంలో 400 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విజయనగరంలో 60 ఎకరాల్లో క్రీడాస్టేడియం నిర్మిస్తున్నట్టు తెలిపారు. దేవరపల్లి హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన క్రీడా రికార్డు కేంద్రం పూర్తి చేస్తామని తెలిపారు.తిరుపతి, నెల్లూరు, కాకినాడ, విశాఖపట్నంలో స్టేడియంలు నిర్మించి జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికయ్యే విధంగా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.2025 డీఎస్సీలో దేవరపల్లి మండలానికి చెందిన నా శిష్యులు 14 మంది వ్యాయామోపాధ్యాయులుగా ఎంపికవడం ఆనందంగా ఉందని తెలిపారు.


చిన్ననాటి కోరిక తీరింది!

రిటైర్డ్ జస్టిస్ రమణ



వేద సభల్లో పాల్గొనాలనే కోరిక చాలా మందికి ఉంటుంది.. కానీ ఆ అవకాశం కొంత మందికే వస్తుంది.. అలాగే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు ఆ కోరిక ఉంది. అంబాజీపేట మండలం నందంపూడిలో మంగళవారం నిర్వహించిన వేద సభలో అవకాశం వచ్చింది. దానిలో భాగంగా ఆ కోరికను బయటపెట్టారు. తనకు చిన్నప్పటి నుంచి వేదసభలో పాల్గొనాలనే కోరిక ఉండేదని.. తాను నందంపూడి వేదసభలో పాల్గొని వేదఘోషను ఆస్వాదించడంతో నెరవేరిందని అన్నారు. వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందానని వెల్లడించారు. 7

విజిలెన్స్‌కీ.. చిక్కలేదు!



బూరుగుపూడి ఆవ..అక్రమాల త్రోవ

- పక్కాగా 'ఆవ' పెట్టేసిన వైసీపీ
- ఒక్క ఆధారం దొరక్క తంటాలు
- రూ.150 కోట్ల భూసేకరణ స్కాం
- పేదల ఇళ్లస్థలాల పేరిట దోపిడీ
- అప్పట్లో సంచలనం
- కూటమి వచ్చినా తేలని వైనం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అవినీతి జరిగింది.. జనం సొమ్ము సుమారు రూ.150 కోట్లు వైసీపీ నాయకులు హవాలా కంటే తెలివిగా దోచేశారు. కానీ ఇప్పుడు ఆ అక్రమాలను నిరూపించడంలో మాత్రం అధికారులు చేతులెత్తేస్తున్నారు. దోపిడీ లెక్కల్లో కూడా పక్కాగా వ్యవహరించడంతో ఒక్క ఆధారం విజిలెన్స్‌కి చిక్కడం లేదు. వాటాల్లో తేడాలతో సాక్షాత్తూ అప్పటి వైసీపీ ఎమ్మెల్యే, వైసీపీ ఎంపీ ఒకరిపై ఒకరు బహిరంగంగానే భూముల బురదను జల్లుకున్నారు. కానీ ఇప్పుడు ఆ అక్రమాలను నిరూపించడంలో మాత్రం అధికారులు తంటాలు పడుతున్నారు.విజిలెన్స్ సైతం సైలెన్స్ అయిపోయింది. అప్పట్లో ఆరోపణలు చేసుకున్న వైసీపీ నాయకులను ఎందుకు ప్రశ్నించడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా రాజానగరం,కోరుకొండ మండలాల్లోని ఆవ భూముల్లో దర్యాప్తు జాడ కారిపోతోంది. ఆవలోని అవినీతిని తవ్వి ఎలుకను పట్టలేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.స్థానిక ప్రజాప్రతినిధులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో మళ్లీ ఫైలు బూజు దులిపే అవకాశం కనిపిస్తోంది.

రూ.210 కోట్లు చెల్లించి

1800 ఎకరాల భూసేకరణ చేయాలని నిర్ణయించారు. చివరికి 586 ఎకరాలు సేకరించారు. రైతుల నుంచి పత్రాలు తీసేసుకున్నారు. ఆరోపణలు వెల్లువెత్తడంతో 200 ఎకరాల పత్రాలను రైతులకు తిరిగిచ్చేశారు. నికరంగా రాజానగరం,కోరుకొండ మండలాల్లో 386 ఎకరాలకు రూ.45 లక్షల నుంచి రూ.60 లక్షల చొప్పున ప్రభుత్వం రైతులకు చెల్లించింది. సుమారు రూ.40 కోట్లు విలువ చేసే ఆవ భూములను రూ.210 కోట్లు చెల్లించి కొన్నారు. ఇవి ముంపు భూములని జల వనరుల శాఖ సైతం ధ్రువీకరించింది. గోదావరికి వరదలు వచ్చినప్పుడు 15-20 అడుగుల మేర నీరు నిలిచిపోతుంది. ఎలా చూసినా ఈ భూములు నివాస యోగ్యం కాదు.ఈ స్కాంలో అప్పటి వీఆర్వో నుంచి కలెక్టర్ వరకూ తలో చెయ్యి వేశారు.

కథ ఇలా మొదలు..

వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వ భూముల అవసరత ఏర్పడింది. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, రాజానగరం మండలాల పరిధిలోని 40 వేల మంది లబ్ధిదారులకు స్థల సేకరణ చేయాలని నిర్ణయించారు. 2020 మే 18న రెవెన్యూ శాఖ ప్రైవేటు భూముల సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ముంపు భూములు పనికిరావని షరతు విధించింది. అయినా ఎందుకూ పనికిరాని ఆవ ముంపు భూములే సేకరించేలా ప్రభుత్వానికి అప్పటి అధికారులు నివేదిక ఇచ్చేశారు. పక్కా ప్లాన్ ప్రకారం అవినీతికి తెరలేపారు. అప్పట్లో సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం ఎకరం రూ.7.2 లక్షలు ఉంది. మార్కెట్ విలువ ఇంకాస్త ఎక్కువ ఉంటుంది. అయినా సరే వరదొస్తే మునిగే భూములను ఎవరు కొంటారు. సబ్ రిజిస్ట్రార్ ధరకు ఆ భూములను కొనడానికి ముందుకు రాని పరిస్థితి ఉంది. దీనిని వైసీపీ నేతలు అక్రమ సంపాదనకు అవకాశంగా మలుచుకొన్నారు.

గంపగుత్తగా ఉండడంతో..

ఇక్కడి భూముల్లో అధికశాతం వస్త్ర వ్యాపారులు, వేరే జిల్లాలోని ఒకే సామాజిక వర్గానికి చెందిన వాళ్లవి గంపగుత్తగా ఉన్నాయి. ఇంకేముంది! వైసీపీ నేతలు రంగంలోకి దిగి వాళ్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఎకరా రూ.10 లక్షలకు కొనడానికి ఎవరూ ముందుకు రాని భూములను కొంటామనడంతో యజమానులు ఎగిరి గంతేశారు. ఎకరాకు రూ.45 లక్షల నుంచి రూ.60 లక్షల వరకూ ఇప్పిస్తామని చెప్పడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.వైసీపీ నాయకులతో మౌఖిక ఒప్పందాలు చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వమే అండగా ఉండడంతో ఆనాటి అధికారులు కూడా దూడూ బసవన్నలు అయిపోయారు. రాజమహేంద్రవరం మాజీ ఎంపీ భరత్, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరుల బహిరంగ పంచాయతీలు నాటి సీఎం జగన్ వరకూ వెళ్లాయి.

పక్కా వ్యూహం..

విదేశాలకు హవాలా సొమ్ముల తరలింపు, మనీ లాండరింగ్‌లో కూడా ఇంత పక్కా వ్యూహంతో అవినీతి జరగదు. మార్కెట్ ధర కంటే కూడా మూడింతలు ఎక్కువగా ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశారు. రూ.45 లక్షల్లో రూ.25 లక్షలు రైతుకు, రూ.20 లక్షలు వైసీపీ గెద్దలకు, అధికార గణానికి పంపకాలు చేశారు. ఈ భూముల యజమానుల్లో అధికశాతం మోతుబరులే. ఏడాదికి కోట్లలో టర్నోవర్ చేసే వ్యాపారాలు ఉన్నాయి. దీంతో ఒక్క రూపాయి కూడా అక్రమార్కులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరపలేదు. ప్రభుత్వం పరిహారంగా రైతులకు ఇచ్చిన సొమ్ములు కాబట్టి పన్నులు ఉండవు. వాళ్ల అకౌంట్ల నుంచి రూ.50 వేల నుంచి లక్షల రూపాయలు విత్‌డ్రా చేసినట్టు బ్యాంకు స్టేట్‌మెంట్లలో ఉంది. వేరే కంపెనీలకు బదలాయించినట్టు కూడా ఉంది. అక్కడి నుంచి డబ్బులు డ్రా చేసి వైసీపీ నేతలకు ఇచ్చారు. విజిలెన్స్ అధికారులు బ్యాంకు అకౌంట్లు తదితర రికార్డులు పరిశీలించి హతాశులయ్యా రు.ఫైలును పక్కన పెట్టేశారు.కోట్లాది రూపాయల అవినీతిలో ఒక్క ఆధారాన్ని పసిగట్టలేకపోతున్నారు.

సీఐడీ దర్యాప్తు చేయాలి?

విజిలెన్స్ వద్ద ఫైలు పడకేయడంతో ఈ కేసును సీఐడీ లేదా అంతకంటే పెద్ద దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు సీఎం చంద్రబాబును కోరడం గమనార్హం.మరోవైపు తమ భూములు కొనే వాళ్లే లేని పరిస్థితుల్లో మూడింతల సొమ్ము అదనంగా ఇచ్చి కొనడంతో ఆయా రైతులు నోరు మెదపడం లేదు.ఎవరైనా సాక్ష్యం చెప్పినా,స్టేట్‌మెంట్ ఇచ్చినా వాళ్లకు కూడా అవినీతి కేసులు చుట్టుకుంటాయని, అదనంగా ప్రభుత్వం ఆ రోజున చెల్లించిన సొమ్ము వెనక్కి ఇచ్చేయాల్సి వస్తుందని వైసీపీ నేతలు ఇప్పటికే రైతులు, స్థానికులను భయపెట్టారు. దీంతో అందరూ కుక్కిన పేనుల్లా కిమ్మనడం లేదు.ఎవరైనా ముందుకు వచ్చి తమ వివరాలను గోప్యంగా ఉంచడంపై హామీ తీసుకొని నిజాలు వెల్లడిస్తే వైట్ కాలర్స్ దోపిడీ సొమ్ము తిరిగి ఖజానాకు చేరే అవకాశం ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘాస్వరూప్

స్టాక్ పాయింట్లలో ఇసుక 8.19 లక్షల టన్నులు

శాండ్ కమిటీ సమీక్షలో కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భవన నిర్మాణాలకు కావాల్సినంత ఇసుక అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. స్టాక్ పాయింట్లలో 8.19 లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉందని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, గోదావరి వరదల కారణంగా జూన్ 1 నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ ఇసుక తవ్వకాలు నిలిపివేశామని తెలిపారు. ప్రస్తుతం డీసిల్టేషన్ ర్యాంపులు మొదలయ్యాయని, ఓపెన్ రీచ్‌లకు కొంత సమయం పడుతుందన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచే ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వకోవచ్చని..కానీ వరదల దృష్ట్యా ర్యాంపులలో ఇసుక తీసే పరిస్థితి లేదన్నారు. జిల్లా పరిధిలోని 29 స్టాక్ పాయింట్లలో మొత్తం 9,96,736 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేయగా ఇప్పటి వరకూ 5,20,397 టన్నుల ఇసుక వినియోగించారన్నారు.ఇంకా 4,76,339 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇతర జిల్లాలకు కేటాయించిన 8 స్టాక్ పాయింట్లలో 3,92,434 మెట్రిక్ టన్నుల్లో ఇప్పటికి 49,914 మెట్రిక్ టన్నులు వినియోగించగా 3,42,520 మెట్రిక్ టన్నుల ఇసుక ఉం దన్నారు. జిల్లాలో ఇంకా 8.19 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా, అధిక లోడు వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెడ్జింగ్ అపరేషన్లను కట్టడి చేయాలని చెప్పారు. ఇప్పటి వరకూ 247 వాహనాలను బ్లాక్ లిస్ట్‌చేసి రూ.80లక్షలు జరిమానాలు విధించామని, 1,675 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేశామన్నారు. జిల్లాలో 35 డ్రెడ్జింగ్ బోట్లు, 27 సాధారణ బోట్లు, మూడు ఎక్స్‌కవేటర్లను గుర్తించి కేసు నమోదు చేశామని చెప్పారు. సమావేశంలో జేసీ వై.మేఘ స్వరూప్, అదనపు ఎస్పీ డి. మురళీకృష్ణ, జిల్లా మైన్స్ అధికారి డి. ఫణిభూషణ్‌రెడ్డి,ఆర్డీవోలు ఆర్. కృష్ణనాయక్, రాణి సుస్మిత, పీసీబీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.శంకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బివిగిరి తదితరులు పాల్గొన్నారు.

'భారీగా టపాసులు నిల్వచేస్తే కేసులు పెట్టండి'

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో ఇంటి వద్ద భారీగా టపాసులు నిల్వలు చేస్తే గుర్తించి కేసులు నమోదు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం జిల్లా, క్షేత్రస్థాయి విభాగాధిపతులతో వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. దీపావళి నేపథ్యంలో షాపుల అనుమతులు, భద్రత చర్యలపై పలు ఆదేశాలిచ్చారు. దీపావళి హోల్‌సేల్ దుకాణాలకు సంబంధించిన దరఖాస్తులు రెవెన్యూపోలీస్, ఫైర్ శాఖల అధికారులతో కూడిన కమిటీ ద్వారా పరిశీలించి అనుమతులివ్వాలని ఆదేశించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసే స్టాల్స్ వద్ద భద్రత చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పీజీఆర్ఎస్‌కు వచ్చిన 2500 అర్జీలపై చర్చించారు. రైతు వారీగా పంటల దశల ప్రకారం ఎరువుల వినియోగం సమయ పట్టిక సిద్ధం చేయాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.భాస్కరరెడ్డి, సీపీవో ఎల్.అప్పలకొండ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డీసీవో ఎం.వెంకటరమణ, డీపీవో వి.శాంతమణి, డ్వామా పీడీ ఏ.నాగమహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానంద.. పవనాలు!



ఉప్పాడలో గురువారం జరిగిన సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ (ఫైల్‌ఫొటో)

డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.. నెరవేర్చారు

- సెజ్ రైతులకు న్యాయం
- 2,180 ఎకరాలు ఇచ్చేలా జీవో
- రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు
- 1551 మంది రైతుల ఆనందం
- బోట్లకు రూ.72 లక్షల పరిహారం

కొత్తపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ నాడు హామీ ఇచ్చారు.. అది నేడు నెరవేర్చారు. కేఎస్ఈజెడ్ (కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి) పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించేలా బాధ్యత తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ఆ హామీని డిప్యూటీ సీఎం హోదాలో నిలబెట్టుకున్నారు. కాకినాడ సెజ్‌కు ఇచ్చిన భూముల్లో 2,180 ఎకరాలను తిరిగి రైతులకు ఇచ్చి మేలు చేయాలని ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు సెజ్‌లో అవార్డు భూములను తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ఈ రిజిస్ట్రేషన్‌కు రుసుములు, స్టాంపు డ్యూటీలు వసూలు చేయవద్దని ఆదేశాలిచ్చారు. దీంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో 1551మంది రైతులకు మేలు చేకూరనుంది.

సెజ్ రైతులకు ఊరట..

కాకినాడ సెజ్ పరిధిలో రైతులకు వెనక్కిచ్చిన భూమి తిరిగి రైతుల పేరున రిజిస్ట్రేషన్ కాక సతమతమవుతున్నారు. దీంతో డిప్యూటీ సీఎం గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిచేస్తూ రైతులకు న్యాయం చేశారు. గత ప్రభుత్వంలో కేఎస్ఈజెడ్ భూములపై జీవోనెం.12 విడుదలైనా క్షేత్ర స్థాయిలో రైతులకు మేలు జరగలేదు. దీంతో పిల్లల పెళ్లిళ్లు, చదువుల నిమిత్తం భూములు ఉపయోగపడడంలేదని రైతులు గతంలో పవన్‌కల్యాణ్‌కు నివేదించారు. దీంతో మేలు జరిగేలా చూస్తానని అప్పట్లో రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమస్యను ఇటీవల శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వ విప్ గిడుగు హరిప్రసాద్ కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్య మరోసారి చర్చనీయాంశమైంది. మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వం కాకినాడ సెజ్ రైతులకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీని మినహాయించి తిరిగి రైతుల భూములు వారికి తిరిగి రిజిస్ట్రేషన్ చేసేలా ఆదేశాలిచ్చింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

దెబ్బతిన్న బోట్లకు రూ.72 లక్షల పరిహారం

గురువారం సభలో హామీ ఇచ్చి.. నెరవేర్చిన పవన్

కొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ మినీహార్బర్ వద్ద దెబ్బతిన్న మత్స్యకారుల బోట్లకు ప్రభుత్వం రూ.72 లక్షల నష్టపరిహారం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. నాలుగు రోజుల కిందట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మత్స్యకారుల సమస్యలు తెలుసుకునేందుకు కాకినాడ వచ్చారు. అక్కడ కలెక్టరేట్‌లో మత్స్యకార ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఉప్పాడ హార్బర్ డిజైన్ లోపం కారణంగా తమ బోట్లు దెబ్బతిన్న విషయాన్ని మత్స్యకారులు ఆయన దృష్టికి తీసు కెళ్లారు. ఉప్పాడలో జరిగే సభకు వెళుతూ విహంగ వీక్షణం ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హార్బర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. బోట్లు నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం డిప్యూటీ సీఎం చొరవతో హార్బర్‌లో దెబ్బతిన్న బోట్లకు రూ.72 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మత్స్యకారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం

కొత్తపల్లి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): సెజ్ భూములు తిరిగి రైతులకే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని అధికారిక ప్రకటన వెలువడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్ ఫ్లెక్సీలకు ముమ్మిడివారిపాడు, రావివారిపోడు గ్రామాలతోపాటు పొన్నాడ శివారు మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద సెజ్ రైతులు పాలాభిషేకాలు చేశారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, తెలగంశెట్టి శ్రీనివాసరావు, పిల్లా శివశంకర్, బాపన్నదొర పాల్గొన్నారు.



భూముల బదిలీకి ఫీజుల్లేవు

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ)/కొత్తపల్లి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్ఈజెడ్ భూములను రైతుల పేరున బదిలీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇచ్చిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం తెలిపారు. ఈ మినహాయింపు 1899 స్టాంపు చట్టం సెక్షన్9 (1) (ఏ), 1908 రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 78 ప్రకారం అమలుచేస్తారని ప్రభుత్వం తెలిపిందన్నారు. ఈ మినహాయింపు రైతుల భూమి బదిలీలకు మాత్రమే వర్తిస్తుంది.


ఇందుపల్లిలో శిక్షణ ఇస్తున్న దుర్గాప్రసాద్

కూచిపూడి నృత్యం చేస్తున్న ఆదుర్తి లక్ష్మీ సుస్మిత

అందెల రవమిది పదములదా!

నేడు అంతర్జాతీయ కూచిపూడి నృత్య దినోత్సవం

లయబద్ధమైన సంగీతానికి అనుగుణంగా అవయవాలన్నింటినీ కదుపుతూ చేసే కూచిపూడి నృత్యాన్ని తిలకించేందుకు రెండు కళ్లూ చాలవు. కూచిపూడి నృత్యానికి, భరత నాట్యానికి పోలికలు ఉన్నప్పటికీ వేటికవే ప్రత్యేకత సంతరించుకున్నాయి. సంప్రదాయ కళాకారులు కూచిపూడి నృత్యానికి ఆధునిక హంగులు అద్దుతూ వేలాది మందికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. కృష్ణా జిల్లా కూచిపూడిలో పుట్టిన ఆ నృత్యానికి ఆ గ్రామం పేరు రావడం విశేషం. కూచిపూడి నృత్యానికి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం తీసుకువచ్చిన ఘనత 'పద్మభూషణ్' డాక్టర్ వెంపటి చిన సత్యంకు దక్కుతుంది. ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా అక్టోబరు 15వ తేదీని ప్రపంచ కూచిపూడి నృత్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ శాస్త్రీయ నృత్య రూపకాన్ని సాధన చేసేందుకు ఎందరో విద్యార్థులు ముందుకు వస్తున్నారు. వారికోసం పట్టణాల్లోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లికి చెందిన నాగిరెడ్డి దుర్గాప్రసాద్ శ్రీరామాంజనేయం డ్యాన్స్ అకాడమీ ఏర్పాటుచేశారు. ఆయన వద్ద వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు కూచిపూడి నృత్యంలో తర్ఫీదు పొందారు. ఇటీవల రాజమహేంద్రవరం లాస్యప్రియ కూచిపూడి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ డ్యాన్స్ అండ్‌మ్యూజిక్ ఫెస్టివల్‌లో దుర్గాప్రసాద్ శిష్యులు అద్భుత ప్రతిభ చాటారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో శ్రీరామాంజనేయం అకాడమీ చోటు సాధించింది. కూచిపూడి నృత్యబాల పురస్కారాలు అందించారు. గురువు దుర్గాప్రసాద్ 'నాట్యకళాబ్రహ్మ' పురస్కారం అందుకున్నారు.

ప్రధాన దేవాలయాల్లో ప్రదర్శనలు...

శ్రీరామాంజనేయం డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో కూచిపూడి నృత్య కళా రూపకాలను ప్రదర్శించారు. తొలుత అయినవిల్లి సిద్ధివినాయకుని ఆలయంతో ప్రారంభించి... వాడపల్లి, అన్నవరం, అప్పనపల్లి, విజయవాడ దేవస్థానాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖల ప్రశంసలు అందుకున్నారు. వినాయకచవితి, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. కళా కృషికి గాను గురువు దుర్గాప్రసాద్ వివిధ నృత్య సంస్థల నుంచి నృత్యశ్రీ, నాట్యశౌరి, నాట్య కళాబ్రహ్మ పురస్కారాలు అందుకున్నారు.


రాజమహేంద్రవరంలో జాతీయ స్థాయి పోటీల్లో పురస్కారాలు అందుకున్న అకాడమీ విద్యార్థులు

కూచిపూడి నృత్యంపై ఆసక్తి పెరుగుతోంది

నాగిరెడ్డి దుర్గాప్రసాద్, గురువు, ఇందుపల్లి



ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో కూచిపూడి నృత్యానికి అంతర్జాతీయంగా ఆదరణ పెరిగింది. నృత్యంపై ఆసక్తి కలిగిన చిన్నారులను 'నాట్య మయూరి'లుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నా. చదువులో ఏకాగ్రతకు, మానసిక వికాసానికి, ఉల్లాసానికి కూచిపూడి నృత్యం దోహదపడుతుంది. భామాకలాపంతో పాటు ఎన్నో నృత్యరీతుల్లో శిక్షణ ఇస్తున్నాం.


వసంత మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, చైర్మన్, ఈవో దంపతులు


మలయప్ప అలంకరణలో గరుడ వాహనంపై స్వామివారు

దేవాదిదేవా... శ్రీవాసుదేవా

- మలయప్ప అలంకరణలో శ్రీవారు
- గరుడ వాహనంపై విహరించిన వేంకటేశ్వరస్వామి
- కనుల పండువగా అష్టదళ పాదపద్మారాధన
- వాడపల్లిలో ఐదో రోజుకు 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆత్రేయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. ఐదో రోజైన మంగళవారం ఆలయంలోని వసంత మండపంలో ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సప్తకలశారాధన, మహా స్నపనం, వసంతోత్సవంలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి పాదాల చెంత 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాదపద్మారాధనను కనుల పండువగా నిర్వహించారు. తొలుత బండారు దంపతులు గజమాలతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామివారికి సమర్పించారు. సాయంత్రం హోమాలు, హనుమత్ మూలమంత్ర హవనం, అష్టోత్తర శత కలశారాధన, పంచశయ్యాధివాసము, ఏకాంత సేవ జరిపారు. రాత్రి మలయప్ప అలంకరణలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ దంపతులు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

మహిళల కోలాటం, నాగపూర్‌కు చెందిన బ్యాండ్ వాయిద్యాలు, ఉత్తరప్రదేశ్ కాశీకి చెందిన అఘోరాల విన్యాసాలు, తెలంగాణకు చెందిన బోనాలు, శక్తివేషాలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు వీటిని ఆసక్తిగా తిలకించారు.



డ్రమ్స్ కొట్టిన బండారు...

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. వాడపల్లి ముఖ ద్వారం వద్ద అన్నవరం సత్యనారాయణస్వామి రథయాత్రను తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. డ్రమ్స్ కొట్టి స్టెప్పులు వేసి అందరినీ ఉత్సాహపరిచారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు దంపతులు, ఆకట్టుకున్న అఘోరాల ప్రదర్శన

గెలుపు, ఓటములు సహజం

- నవంబరులో రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు
- సెట్రాజ్ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ
- నన్నయ యూనివర్శిటీలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు


వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, డీడీ

దివాన్‌చెరువు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటమి సహజమని, పోటీల్లో పాల్గొనడమే ముఖ్యమని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీడీఎస్ రామకృష్ణ చెప్పారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2025ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, సెట్రాజ్ డీడీ రామకృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు యువతను సెట్రాజ్ ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి యువజనోత్సవాలను నవంబరు నెలలో అమరావతిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాస్థాయి ఉత్సవాలు ఇప్పటివరకూ కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగాయని అన్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా పూర్తయిన తర్వాత రాష్ట్రస్థాయి ఉత్సవాల తేదీలను నిర్ణయిస్తామన్నారు. జాతీయ స్థాయి యువజనోత్సవాలు వచ్చే ఏడాది జనవరి 10,11, 12 తేదీల్లో ఢిల్లీలో జరుగుతాయని చెప్పారు.

వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. కాగా ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఇన్నోవేషన్ ట్రాక్ సైన్స్ మేళా ప్రదర్శనలో వంగ అయ్యప్ప బృందం, జానపద నృత్యం (బృందం)లో ఎస్ఆర్ఎస్. గ్రూపు, జానపద గేయాలు (గ్రూపు)లో తాతరాజు గ్రూపు, ఉపన్యాసంలో విదూషీ శాండిల్య, కథ రాయడంలో బి.జ్ఞానరామ షర్మిల, పెయింటింగ్‌లో మహ్మద్ సమీర్, కవిత్వంలో జి.ధృవీత్ ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరంతా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి 944 మంది ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సెట్రాజ్ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు, న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు.


జానపద నృత్యం ప్రదర్శిస్తున్న యువతులు

పీఎం-వీబీఆర్‌వై పథకంలో నమోదు కావాలి


కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ ప్రతినిధులు

కాకినాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం అందించే ప్రయోజనాలు పొందడానికి యజమానులందరినీ పీఎం-వీబీఆర్‌వై పథకం కింద నమోదు చేయాలని అదనపు సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి.వీరభద్రస్వామి తెలిపారు. కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్‌లో పీఎం-వీబీఆర్‌వైపై ఈపీఎఫ్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి మాట్లాడుతూ పీఎం-వీబీఆర్‌వై పథకం లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు. ఉపాధి ఉత్పత్తిని ప్రోత్సహించడంలో, శ్రామికశక్తికి సామాజిక భద్రత కవరేజీని విస్తరించడంలో దాని పాత్రను వివరించారు. ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి కూడా పథకం ప్రయోజనాలను వెల్లడించారు. ఆర్థిక, సామాజిక శ్రేయస్సును నిర్ధారించడానికి చొరవను ఉత్తమంగా ఉపయోగించుకోవాలని యజమానులు, కార్మికులను కోరారు. కార్యక్రమంలో కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్, జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శిరీషా తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ కుమార్, కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్, హెచ్ఆర్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'నన్నయ'లో ఆహార మహోత్సవ ప్రదర్శన

దివాన్‌చెరువు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫుడ్, సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో ఆహార మహోత్సవ ప్రదర్శన జరుగుతుందని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్యానర్‌ను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. అలాగే అకడమిక్ ఈవెంట్స్‌ను ప్రారంభించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆసక్తి గల వారు వంటలు సిద్ధం చేసుకుని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, విభాగాధిపతి డి.కళ్యాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్లుకు ఐదవ విడత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలియజేశారు. ప్రవేశానికి iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈనెల 16వ తేదీ సాయంత్రం 2గంటల్లోపు అభ్యర్థి ఏ కళాశాలలో చేరాలో ఆ ఐటీఐలను తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంపిక చేసుకోవాలన్నారు. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ విడతల్లో ఐటీఐ సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా ప్రవేశానికి ఐదవ విడతలో మరలా కొత్త రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులంతా దగ్గరలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ఈనెల 16వ తేదీ సాయంత్రం 4గంటల్లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని లేకుంటే కౌన్సెలింగ్‌కు అర్హులు కాదని వేణుగోపాలవర్మ తెలిపారు. మరిన్ని వివరాలకు 0884 2348182, 94404 08182 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఈ నెల 17వ తేదీ ఉదయం 8గంటల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి కౌన్సిలింగ్ ఉంటుందన్నారు.

భారతదేశ విజ్ఞానమే అన్నింటికీ మూలం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
- రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు


సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక శాస్త్ర, సాంకేతికతకు భారతదేశ విజ్ఞానమే మూలం అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 'ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనం-ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఒక నిధి' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు తొలిరోజు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానానికి ప్రాచీనకాలంలో భారతదేశ విజ్ఞానమే ఒక పునాదిగా నిలిచిందని, విద్యార్థులు, అధ్యాపకులకు మన సంస్కృతి, వారసత్వం పట్ల అవగాహన పెంపొందించడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం మాట్లాడుతూ మన పురాతన భారతీయ జ్ఞాన సంపద గత వైభవం మాత్రమే కాదని, నేటి ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందించగల శక్తివంతమైన సాధనమని అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్కియాలజీ రిటైర్డు ప్రొఫెసర్ డి.భాస్కర మూర్తి మాట్లాడుతూ వేదం, ఉపనిషత్తు యోగం, వాస్తు, వ్యవసాయం, గణితం, ఖగోళ శాస్త్రాలన్నీ మన పూర్వీకులు సాధించిన అసాధారణ విజయాలని అన్నారు. ప్రసిద్ధ నాటకకర్త వాడ్రేవు సుందరరావు మాట్లాడుతూ భారతీయ నాటకరంగం ప్రపంచానికి తలమానికమైనదని అన్నారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ జేడీ చప్పిడి కృష్ణ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సదస్సులో చీమలమర్రి శ్రీనివాస శర్మ, డి.కిరణ్‌కాంత్ చౌదరి, పసుమర్తి శ్రీనివాస్ శర్మ, సి.స్వరూపరాణి తదితరులు పరిశోధనాత్మక పత్రాలను చదివి వినిపించారు. సదస్సుకు 225 మంది తమ గోష్టిపత్రాలను పంపించారని కో-కన్వీనర్ వై.స్వర్ణశ్రీ తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతులమీదుగా సావనీర్ ఆవిష్కరించారు. సదస్సులో పది మంది విదేశీ విద్యార్థులు జింబాబ్వే, జాంబియా, సౌత్ ఆఫ్రికా, కంబోడియా నుంచి పాల్గొన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీలకు హరిప్రియ ఎంపిక



అంబాజీపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కుడుపూడి కావ్యసుందరి హరిప్రియ మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు సాయిరామ్, పీడీలు కుంపట్ల ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకూ బాపట్ల జిల్లా పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీల్లో 20 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచిందని, పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. విద్యార్థినిని పీఈటీ అందె సూర్యకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర బాక్సింగ్ పోటీల్లో శివకోడు విద్యార్థులకు పతకాలు



రాజోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. అండర్-14 విభాగంలో కానూరి శివచరణ్, అండర్-17 విభాగంలో పాలపర్తి విజయ్‌కుమార్ కాంస్య పతకాలు సాధించాడని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలను సాధించిన క్రీడాకారులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, బాక్సింగ్ కోచ్ బొంతు మధుకుమార్ అభినందించారు.

పంచారామ క్షేత్రాల దర్శనానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజరు ఎంయూవీ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపోలో ఆన్‌లైన్ రిజర్వేషన్ కూడా ప్రారంభించనున్నట్టు తెలిపారు. పంచారామ క్షేత్రాల స్పెషల్స్ ఈ నెల 25, 26, నవంబరు 1, 2, 8, 9, 15, 16 తేదీల్లో ప్రతి శనివారం, ఆదివారం కాకినాడలో రాత్రి 8 గంటలకు బయల్దేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట దర్శనాలు పూర్తయిన తర్వాత మరుసటి రోజు రాత్రి 8 గంటలకు కాకినాడ చేరతాయని చెప్పారు. టిక్కెట్లు కావాల్సిన వారు ఆర్టీసీ ఆథరైజ్డ్ ఏజెంట్ల వద్ద (లేదా) ఆర్టీసీ వెబ్‌సైట్ www.apsrtconline.inలో తీసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 99592 25564, 73829 10869, 73829 10569, 73829 10658, 94928 33885 నెంబర్లను సంప్రదించాలన్నారు.

డొంకరాయి నుంచి దిగువకు 10,000 క్యూసెక్కులు


జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

మోతుగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి దిగువకు 10,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు మంగళవారం తెలిపారు. డొంకరాయి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా డొంకరాయి ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం నాటికి 1036.50 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై జలాశయ నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరుకోకుండా 1036.50అడుగుల వద్ద స్థిరంగా నీటి మట్టం కొనసాగేలా జలాశయం నుంచి ఆరో నెంబర్ గేటు ద్వారా 0.84 అడుగుల ఎత్తి దిగువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం డొంకరాయి పవన్ కెనాల్ ద్వారా మరో 4000 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి 5000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందని పేర్కొన్నారు.

యానాం.. జలమయం!

- ఎడతెరిపిలేని భారీ వర్షం
- నీట మునిగిన రోడ్లు
- పిడుగుపాటుకు సిమెంట్ పిల్లర్ ధ్వంసం


జలమయమైన ఓ రోడ్డు


నీట మునిగిన పిల్లారాయస్వామి ఆలయం

యానాం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యానాంలో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో 3 గంటలు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు విపరీతంగా వీయడంతో పలుచోట్ల వృక్షాలు నేల కొరిగాయి. యానాంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు క్రీడా ప్రాంగణాలు చెరువులను తలపించాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలో వర్షంనీరు నిలిచిపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పిల్లారాయస్వామి ఆలయం, పోలీస్‌స్టేషన్ సముదాయాలు నీటమునిగాయి. ప్రధానంగా అన్ని రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. కురసాంపేట గ్రామంలో కొబ్బరి చెట్టుపై, అలాగే గుండాబత్తుల సూర్యనారాయణ ఇంటిపై పిడుగు పడడంతో మూడు అడుగులున్న కాంక్రీట్ పిల్లర్ పగిలిపోయి చెల్లాచెదురైంది. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటనతో నాలుగు టీవీలు, ఎనిమిది సీలింగ్ ఫ్యాన్లు కాలిపోయినట్టు బాధితులు తెలిపారు.


కళాశాలకు వెళ్లే విద్యార్థుల ఇక్కట్లు


యానాంలో చెరువును తలపిస్తున్న జూనియర్ కళాశాల ప్రాంగణం

వేదాలు, వేదపండితులకు ఎల్లప్పుడు గౌరవం

- వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందా
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ
- కోనసీమ జిల్లా నందంపూడిలో వేద సభ




నందంపూడిలో రమణకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు, సభలో పాల్గొన్న రమణ

అంబాజీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేదాలు, వేదపండితులకు ఎల్లప్పుడు మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నందంపూడిలో వడ్లమాని లక్ష్మీనారాయణ అవధాని స్మృతియుర్థం ఆయన కుమారుడు సుబ్రహ్మణ్య ఘనపాటి ఆధ్వర్యంలో వడ్లమాని లక్ష్మీనారాయణ మెమోరియల్ ట్రస్టు పేరిట వేద సభ మంగళవారం నిర్వహించారు. సభకు మహా మహోపాధ్యాయ శాస్త్ర నిధి విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేదసభలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వేద సభలు నిర్వహిస్తే వేదాల ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తంగా చాటి చెప్పడంతో పాటు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లని.. దక్షిణ భారతదేశంలోని కోనసీమ ప్రాంతం వేద పండితులకు పుట్టిల్లన్నారు. నాకు చిన్నప్పటి నుంచి వేదసభలో పాల్గొనాలనే కోరిక ఉండేదని, తాను నందంపూడి వేదసభలో పాల్గొని వేదఘోషను ఆస్వాదించడంతో చిన్ననాటి కోరిక నెరవేరిందని రమణ తెలిపారు. వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందానన్నారు. తొలుత నందంపూడి చేరుకున్న ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అలాగే వడ్లమాని లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో రమణ కుటుంబసభ్యులు కొద్దిసేపు మాట్లాడారు. తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో తిరుపతిలో తనతో సుబ్రహ్మణ్యఘనపాటి తీయించుకున్న ఫొటోలను చూసి ఆనందంపొందారు. వేంకటేశ్వర స్వామి దయ వల్ల తాను ఆ పదవిలో ఎంతో సమర్థవంతంగా పనిచేశానన్నారు. కార్యక్రమం అనంతరం వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని మనువడు ప్రముఖ వేదపండితులు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్య రవితేజ ఘనాపాటికి జస్టిస్ రమణ సింహతలాటాన్ని అలకరించి సత్కరించారు. లక్ష్మీనారాయణ అవధాని మెమోరియల్ ట్రస్టుకు రూ.2లక్ష చెక్కును విరాళంగా అందించారు. జస్టిస్ రమణకు తహశీల్దార్ చిన బాబు, సీఐ రుద్రరాజు భీమరాజు మొక్కలను అందించి ఘనస్వాగతం పలికారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పీకే రావు, టీటీడీ బోర్డు మాజీ డైరక్టర్ డొక్కా నాథ్‌బాబు, ఎంపీటీసీ వడ్లమాని పద్మావతి, పితాని వీరాస్వామి, అరిగెల బలరామమూర్తి, వేదపండితులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో శాంతిహోమం


హోమక్రతువు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం అన్నవరం దేవస్థానంలో చేపట్టిన శాంతిహోమం మంగళవారం కొనసాగింది. పండితులు మన్యసూక్తపారాయణ, చండీ పారాయణ, శ్రీ మత్త్రిపాద్విభూతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, వైదిక కార్యక్రమాలు ముగియనున్నాయి.

ఏం సమాచారమొచ్చిందో..!

కాకినాడ సీ, యాంకరేజ్ పోర్టులను ఆకస్మికంగా పరిశీలించిన ఎస్పీ


కాకినాడ సీ పోర్టులో ఎస్పీ బిందుమాధవ్


పోర్టులో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

కాకినాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీ పోర్టు, యాంకరేజ్ పోర్టులను కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి భద్రతా వ్యవస్థలను పరిశీలించారు. పోర్టు నిర్వహణలో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులలో పొందుపరిచిన విషయాలను క్షుణ్ణంగా గమనించారు. పీఆర్‌వో సబ్ ఇన్‌స్పెక్టర్ పి.పవన్‌కుమార్, ఏపీ ఆర్వో సిబ్బందికి తగు మార్గదర్శకాలు ఇచ్చారు. అలాగే పోర్టు పరిధిలోని చెక్‌పోస్టుల పనితీరుపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిని కలిసి భద్రతా అంశాలపై దృష్టి సారించారు. చెక్‌పోస్టు సిబ్బందికి భద్రత, విజిలెన్స్, రికార్డ్ మేనేజ్‌మెంట్ సంబంధిత అంశాలపై స్పష్టమైన సూచనలు అందించారు. కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ జాకబ్ సత్యరాజు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు, సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యనారాయణ తదితరులు పోర్టులో భద్రతా చర్యలపై వివరాలు సమర్పించారు. పోర్టు భద్రతను మరింత బలోపేతం చేయడానికి సాంకేతిక పరికరాలు సీసీ టీవీ పర్యవేక్షణ, అలర్ట్ రెస్పాన్స్ సిస్టమ్‌ను మరింత సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. భద్రతా చర్యల్లో ఎటువంటి అలసత్వం ఉండకూడదని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆకస్మిక పర్యటనతో అక్కడ పోర్టు అధికారులు అలర్ట్ అయ్యారు. భద్రతను ముమ్మరం చేశారు. ఏదైనా ఉపద్రవం ఏమైనా తలెత్తే అవకాశం ఉందా? అన్నట్టుగా కంగారు పడ్డారు. ఇది సాధారణ తనిఖీనా లేక ఏమైనా సమాచారం వచ్చిందా? అని ఆశ్చర్యపోయారు. మరోవైపు బిందుమాధవ్ కూడా ఈ మధ్య కాలంలో ఇలా పోర్టులో ఆకస్మిక పర్యటనలు చేసిన దాఖలాలు లేవు. మొత్తానికి ఆయన పర్యటన వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తీర ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకే ఆయన పర్యటన చేశారా? మరే ఇతర కారణమేదైనా ఉందా? అనేది అంతుచిక్కడం లేదు.

మల్లాంలో గ్యాస్‌లీక్

- చెలరేగిన మంటలు
- ముగ్గురికి తీవ్రగాయాలు


మల్లాంలో గాయపడిన వ్యక్తి

పిఠాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాంలో మంగళవారం రాత్రి గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలోని మల్లెపాముల వీర నాగేశ్వరరావు ఇంటిలో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు, అతడి భార్య నాగలక్ష్మి, అన్నయ్యతో మాట్లాడేందుకు వచ్చిన తమ్ముడు లోవరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి ఏడుస్తున్నాడని బయటకు రావడంతో నాగేశ్వరరావు ఇద్దరి పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏటిమెరక ఓఎన్జీసీ సైట్‌లో గ్యాస్ లీక్

ఉప్పలగుప్తం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం పంచాయతీ ఏటిమెరక ఓఎన్జీసీ సైట్‌లో మంగళవారం గ్యాస్‌లీకేజీతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గ్యాస్ పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీని ఓఎన్జీసీ టెక్నికల్ సిబ్బంది సరిచేశారు. కొద్దిసేపటికి పైప్‌లైన్ ప్రదేశంలో నీటిబుడగలు ఎగదన్నడంతో స్థానిక పెద్దలు ఓఎన్జీసీ అధికారులకు సమాచారమందించారు. పైప్‌లైన్ ఎప్పుడు పగిలి గ్యాస్ ఎగదన్నుతుందోనని పరిసరప్రాంతాల మహిళలు ఆందోళనచెందుతున్నారు.

ప్రజలపై కొండముచ్చు దాడి

మాగాంలో బంధించిన అటవీశాఖాధికారులు


కొండముచ్చును బంధించిన అధికారులు



అయినవిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం మాగాం గ్రామంలో గత కొన్నిరోజులుగా ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న కొండముచ్చును అటవీశాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గత ఆరు నెలల నుంచి మాగాం గ్రామంలో కొండముచ్చు నివసిస్తుంది. గ్రామస్తులు దానికి ఆహారం పెడుతున్నారు. గత రెండు రోజుల నుంచి ఒంటరిగా ఉన్న వ్యక్తులపై కొండముచ్చు దాడి చేసి గాయపరుస్తుంది. ఐదుగురు కొండముచ్చు దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు స్థానిక పంచాయతీ అధికారులు, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం అటవీశాఖ అధికారులు కొండముచ్చును బోనులో బంధించారు. అటవీ ప్రాంతంలో వదిలి వేస్తామని వారు తెలిపారు.

కోడి పందాలు చూద్దామని తీసుకెళ్లి హత్య

● నిందితుడి అరెస్టు ● వివరాలు వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

ఏలేశ్వరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడిని ఏలేశ్వరం పోలీసులు పట్టుకున్నారని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. మంగళవారం ఏలేశ్వరంలో విలేకర్లకు ఈ వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో బొదిరెడ్డి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈనెల 2న అదృశ్యమవ్వడంతో అతడి కుమారుడు ఆంజనేయులు 4న ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ సూచనల మేరకు వెంకటేశ్వర్లు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న ఏలేశ్వరానికి చెందిన రాజా రమేష్ అడ్డతీగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. చికిత్స అనంతరం కోలుకున్న అతడిని సోమవారం అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణ చేపట్టగా తానే వెంకటేశ్వర్లును హత్య చేసినట్టు రమేష్ ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. వారిద్దరికి కోడి పందాల్లో పరిచయం ఉంది. ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయి. ఈ క్రమంలోనే కోడి పందాలు చూద్దామనే సాకుతో వెంకటేశ్వర్లును రాజా రమేష్ కారులో తీసుకెళ్లి కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చాడు. అపస్మారకస్థితికి వెళ్లిన వెంకటేశ్వర్లను హత్య చేసి ఏజెన్సీ ప్రాంతం కొయ్యూరు సమీపంలోని బోదరాళ్ల ఘాట్ వద్ద తుప్పల్లో పడేసి వచ్చాడు. రాజా రమేష్ వెంకటేశ్వర్లు వద్ద రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చమని ఒత్తిడి తేవడంతో అప్పు తీర్చే దారిలేక వెంకటేశ్వర్లను రాజా రమేష్ హత్య చేసినట్టు విచారణలో వెల్లడించాడని డీఎస్పీ పేర్కొన్నారు. వెంకటేశర్లు ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను తీసి ఏలేశ్వరంలో ప్రయివేటు బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.3.5 లక్షలు తీసుకున్నాడని డీఎస్పీ తెలిపారు. రాజా రమేష్‌ను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టుకు తరలించినట్టు తెలిపారు. కేసును ఛేదించడంలో ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు,సిబ్బంది కృషిని ఎస్పీ అభినందించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఒకదాత రూ.లక్ష యాభై ఒక్క రూపాయి విరాళం అంజేశారు. హైదరాబాద్‌కు చెందిన జి.శ్రీమన్నారాయణ లక్ష్మి దపంతులు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.

ధర్మవరంలో చోరీ

- రూ.18 లక్షల విలువైన బంగారు, నగదు అపహరణ
- ఆలస్యంగా వెలుగులోకి..

ప్రత్తిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో రూ.18లక్షల విలువైన బంగారు అభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. గ్రామంలోని సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న పలివెల లక్ష్మీనారాయణ గృహంలో జరిగిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం... హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న తన కుమారుడు పలివెల సంతోష్ వద్దకు 10రోజుల కిందట లక్ష్మీనారాయణ దంపతులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. 10 రోజుల పాటు కుమారుడు ఇంటి వద్ద గడిని మంగళవారం ధర్మవరం చేరుకున్న లక్ష్మీనారాయణ దంపతులు ఇంటి వద్ద తలుపుకు తాళం పగలకొట్టి దుండగులు చోరీకి పాల్పడినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గృహంలోని బీరువాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, మరో రూ.2లక్షల నగదు, ఇతర వస్తువులు చోరీకి గురైనట్టు తెలిపారు. ఇటీవల గ్రామంలోనే హనుమాన్ కాలనీలో దుండగులు చొరబడి రూ.6లక్షలు విలువైన ఆభరణాలు దోచుకువెళ్లారు. ఇలా వరుసుగా గ్రామంలో దొంగతనాలు జరగడం పట్ల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

ఉద్యోగాల పేరుతో రూ.లక్షల్లో మోసం

కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై కేసు

కోటనందూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో బొద్దవరం గ్రామానికి చెందిన మళ్ల మల్లేశ్వరరావు, తునికి చెందిన కసిరెడ్డి దుర్గారత్నం కేంద్రప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.25లక్షలు వసూలు చేసి నకిలీ అపాయిమెంట్‌లెటర్‌లు ఇచ్చి చాలామందిని మోసం చేశారు. అందులో బొద్దవరం గ్రామానికి చెందిన గెడ్డం ప్రేమ్‌కుమార్ నుంచి రూ.2.80 లక్షలు, ఎస్అర్‌పేట గ్రామానికి చెందిన రొట్టెల రాజు నుంచి రూ.3.80 లక్షలు, నాతవరం మండలం ఎస్‌బి పట్నం గ్రామానికి చెందిన పొట్నూరి శివకుమార్ నుంచి రూ.4.30 లక్షలతో పాటు పలువురి నుంచి భారీగా వసూలు చేశారు. బాధితుల ఫిర్యాదుతో మల్లేశ్వరరావు, దుర్గారత్నంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

14 రోజుల రిమాండ్ విధింపు

కె.గంగవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పామర్రు గ్రామంలో దొంగతనం చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్‌కె.జానీబాషా తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పామర్రులోని దేవ రపల్లి సత్యవతి ఇంట్లో ఎవరూ లేని సమ యంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి బంగారు ఉంగరం, ఇత్తడి సామన్లు చోరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి తాళ్లపొలం గ్రామానికి చెందిన పప్పుల ప్రభుకుమార్ (22), ద్రాక్షారామం గ్రామానికి చెందిన కోడూరి వెంకటేష్‌ను నిందితులుగా గుర్తించారు. వారిని మంగళవారం రామచంద్రపురం మండలంలోని తాళ్లపొలం గ్రామ పరిధిలోని తాళ్లపొలం గృహకల్ప అపార్ట్‌మెంట్స్ వద్ద అరెస్టు చేశారు. రామచంద్రపురం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు. వారి నుంచి దొంగతనం చేసిన సొత్తు బంగారు ఉంగరం, ఇత్తడి బిందె (రూ.38,000), కరప పోలిస్టేషన్ పరిధిలో అరట్లకట్ట గ్రామంలో చోరీకి సంబంధించిన 12 గ్రాముల బంగారు గొలుసు (రూ.36,000)ను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

బావమరిది చనిపోయాడని వెళ్తుండగా..

- లారీని మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు


మరణించిన దొడ్డి నాగు


ఫైల్

దేవరపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): లారీని మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరి గింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... పోలవరం మండలం కొత్తపట్టి సీమ గ్రామానికి చెందిన దొడ్డి నాగు (35) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విజయవాడలో తన బావమరిది చనిపోయాడని కబురు రావడంతో కొత్తపట్టిసీమ నుంచి తూర్పుగోదావరి కొవ్వూరు మండలం దొమ్మేరు వచ్చాడు. తన మేనమామ కుమారుడు తాళ్ల అభిషేక్‌తో మోటార్ సైకిల్‌పై మంగళవారం ఉదయం విజయవాడకు పయనమయ్యారు. ఎదురుగా వెళ్తున్న క్వారీ లారీ యర్నగూడెం శివారు గండిచెరువు వద్ద మలుపు తిప్పుతుండగా వెనుక నుంచి వేగంగా మోటార్‌సైకిల్ దూసుకెళ్లి ఢీకొనడంతో దొడ్డి నాగు (35) అక్కడికక్కడే మృతి చెందాడు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన తాళ్ల అభిషేక్‌కు కాలు విరగడంతో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. మృతుడు నాగుకు భార్య సీత, కుమార్తె రచిత, కొడుకు చరణ్ ఉన్నారు. నాగు మృతదేహాన్ని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కూలీ పనులకు వెళ్తుండగా..

లారీ ఢీకొని మహిళ మృతి


లారీ టైర్ల మధ్యలో మృతదేహం

కడియం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడియపులకంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరితోటకు చెందిన కాదా గంగమ్మ (65) మరణించింది. పోలీసుల వివరాల ప్రకారం.. గంగమ్మ కడియపులంకలో కూలీ పనులకు మోటారుసైకిల్ లిఫ్టు అడిగి వెళ్తుండగా కడియపులంక వచ్చే సరికి పొట్టిలంక నుంచి కడియపులంక వైపు ఎదురుగా వస్తున్న లారీ గంగమ్మ ప్రయాణిస్తున్న మోటారుసైకిల్‌ను ఢీకొంది. దీంతో గంగమ్మ లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. మోటారుసైకిల్ నడుపుతున్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గంగమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ ధనలక్ష్మి కేసు నమోదు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత

- గొల్లప్రోలులో 37.80 క్వింటాళ్లు స్వాధీనం
- వాహనం సీజ్


గొల్లప్రోలులో స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం, వాహనంతో పోలీస్, సివిల్ సప్లైస్ అధికారులు

గొల్లప్రోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్‌బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో గొల్లప్రోలు అడిషనల్ ఎస్ఐ లక్ష్మణరావు, ఏలేశ్వరం సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ వీఆర్‌కేవీ ప్రసాద్, రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులోని బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టారు. వ్యాన్‌లో రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా గుర్తించారు. 80 బస్తాల్లో ఉన్న 37.80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన నందిపాటి వీరబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని పిఠాపురం ఎంఎల్ ఎస్ పాయింట్‌కు అప్పగించారు. సివిల్ సప్లైస్ డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్ఐ తెలిపారు. కాగా తరలిస్తున్న వ్యాన్‌కు ఎటువంటి నెంబరు ప్లేట్లు లేకపోవడం గమనార్హం.

రాజవొమ్మంగిలో 1600 కిలోలు..

రాజవొమ్మంగి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి అక్రమంగా రవాణా అవుతున్న పీడీఎస్ బియ్యాన్ని రాజవొమ్మంగి తహశీల్దార్ అల్లు సత్యనారాయణ పట్టుకున్నారు. మండలంలోని లాగరాయి గ్రామం నుంచి కాకినాడ జిల్లాకు బియ్యం అక్రమ రవాణా అవుతుందనే సమాచారంతో తహశీల్దార్ సిబ్బందితో దాడి చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలానికి చెందిన కోరుకొండ అచ్చిరాజు తన వ్యాన్‌లో 1600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేయడం గుర్తించి సీజ్ చేశారు. వ్యాన్‌ను పోలీసుస్టేషన్‌కు, బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు.

రాజమహేంద్రవరంలో బ్యాంకు ఉద్యోగుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీపతిరావు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏఐబీఈఏ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జరుగుతున్న ఆందోళనలకు మద్దతుగా మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని కరూర్ వైశ్య బ్యాంకు ఎదుట జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ప్రైవేట్ బ్యాంకులను జాతీయకరణ చేయాలని, క్లరికల్ నియామకాలు జరపాలని,ఫెడరల్ బ్యాంకుల్లో విక్టిమైజేషన్ రద్దు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ధర్నాలో బ్యాంకు ఉద్యోగులు సోమరాజు, మురళీధర్, స్వాతి, రమేష్, అప్పారావు పాల్గొన్నారు.

ఆదర్శ చైర్మన్‌కు జీవిత సాఫల్య పురస్కారం



గోకవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి ఆదర్శ విద్యా సంస్థల చైర్మన్ ప్రగళ్లపాటి కనకరాజును వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సంస్థ జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక చేసినట్టు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు ఎరుకుల్ల రామకృష్ణ మంగళవారం ప్రకటించారు. కనకరాజు విద్యారంగంలోను, ఆర్యవైశ్య సమాజ అభ్యున్నతికి చేసిన కృషికి గాను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ నెల 28న పుదుచ్చేరిలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రంగసామి చేతుల మీదుగా కనకరాజు ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్టు రామకృష్ణ పేర్కొన్నారు.

సీఎం సహాయ నిధి సాయం అందజేత


తోకాడలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

మండలంలోని తోకాడ గ్రామంలో నల్లమిల్లి మణికంఠకు వైద్యం అనంతరం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.27,493 సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే నేరుగా లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదల పాలిట వరంగా మారు

రాజానగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. తోందని, అర్హులైన వేలాది మంది కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి గోదావరి ఇరిగేషన్ ఎంప్లాయీస్ ఎన్నికలు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ఇరిగేషన్ ఎంప్లాయిస్ పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి బీవీవీ సత్యనారాయణ ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అడ్‌హక్ కమిటీ చైర్మన్ వి.వెంకటేశ్వర్లు, నలుగురు ఇతర సభ్యుల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. నామినేషన్లుఈనెల 16వ తేదీ ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకు స్వీకరణ జరుగుతుందని, 17న నామినేషన్ల పరిశీలన, 18న నామినేషన్లు ఉపసంహరణ సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పోటీ అనివార్యమైతే ఈనెల 25న ఉద యం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ ధవళేశ్వరంలోని ఐఎస్‌టీయూసీ భవనం ప్రాంగణంలో జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపునకు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మునిసిపల్ కాంట్రాక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయడానికి టీఆర్ఈడీఎస్ విధానం ద్వారా చెల్లింపులు చేయాలని కోరుతూ మునిసిపల్ కాంట్రాక్టర్లు కలెక్టర్,ఇన్‌చార్జి కమిషనర్ కీర్తి చేకూరికి విన్నవించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్‌ను వారు కలిసి వినతి పత్రం అందించారు. బిల్లుల చెల్లింపుల నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్‌నెం 71ను అమలు చేయాలని కోరారు. చెల్లింపులో ఎఫ్ఐఎఫ్‌వో పద్ధతి పాటించాలన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అధ్యక్షుడు ధర్మాజీ, స్టేట్ జాయింట్ సెక్రటరీ ముత్యాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

కోరుకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోసకాయలపల్లిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద బాధితులను మంగళవారం సాయంత్రం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఏపీఆర్ చౌదరి, అడబాల గణపతి, రజని, శివనాగరాజు, ఎం.రమణ, సీహెచ్ ఆదివిష్ణు, గ్రామ సర్పంచ్ ధారా యశోదమ్మ, ధారా రాంబాబులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులను, గ్రామస్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాగేంద్ర మాట్లాడుతూ ఈ అగ్ని ప్రమాదానికి కారణం 11కేవీ విద్యుత్‌వైర్లు వీరి గుడిసెల నుంచి వెళ్లడమే అని గ్రామస్థుల ద్వారా తెలిసిందన్నారు. అయితే ఇంత ప్రమాదం జరిగి దయనీయ స్థితిలో ఉన్న కుటుంబాలను తహశీల్దార్ కానీ, విద్యుత్ శాఖ అధికారులు కానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని సహాయాలను ఎమ్మెల్యే, ఎంపీల సహాయంతో బాధితులకు అందజేస్తామన్నారు.

కార్డియాలజిస్ట్ లక్ష్మణ్‌కు అంతర్జాతీయ పురస్కారం


డాక్టర్ లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న ప్రముఖ వైద్య నిపుణులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్‌కు అంతర్జాతీయ పురస్కారం లభించింది. సింగపూర్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఏషియా పీసీఆర్-2025 అంతర్జాతీయ సదస్సు స్నాతకోత్సవంలో డాక్టర్ లక్ష్మణ్ ఇంటర్నేషనల్ కార్డియాలజీ విభాగంలో చేసిన సేవలను గుర్తించి ఫెలోషిప్‌తో గౌరవించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ శేట్, మైకేల్ కాంగ్‌ఇన్లీ చేతులమీదుగా ఈ పురస్కారం అందుకున్నట్టు లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, అంతర్జాతీయ సదస్సులో మన దేశం నుంచి పాల్గొన్న కొద్దిమందిలో ఒకరైన డాక్టర్ లక్ష్మణ్‌కు అంతర్జాతీయ పురస్కారం లభించడం సంతోషంగా ఉందని ప్రముఖ వైద్య నిపుణులు, విజయభారతి చెస్ట్ ఇన్‌స్టిట్యూట్ అధినేత డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. అలాగే డాక్టర్ సోమనాధ్, డాక్టర్ వంశీకృష్ణరాజు, విజయభారతి చెస్ట్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో గూడూరి రాధిక, సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, జీఎం పెండ్యాల కోదండరామయ్య, వైద్యులు, జూనియర్ డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది లక్ష్మణ్‌ను అభినందించారు.

ఎమ్మెల్యే వాసును కలిసిన సత్యనారాయణస్వామి దేవస్థానం పాలక మండలి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా నూతన పాలక మండలి వ్యవహరించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు.స్థానిక ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానం నూతన పాలక మండలి సభ్యులు మంగళవారం స్థానిక తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారికి వాసు అభినందనలు తెలిపారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించాలని, ఆలయాభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

17 షాపులకు అనుమతులు

బిక్కవోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగ సందర్భంగా 17 బాణసంచా షాపులకు తాత్కాలిక అనుమతులు మంజూరు చేసినట్టు తహశీల్దార్ సత్యకృష్ణ తెలిపారు. బలభద్రపురంలో ఐదు, బిక్కవోలులో ఏడు, కొమరిపాలెంలో నాలుగు, తొస్సిపూడిలో ఒక షాపు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులిచ్చామన్నారు.

జీఎస్టీ 2.0తో నిర్మాణ రంగానికి ఊతం

» అవగాహన సదస్సులో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

» పలుచోట్ల సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీ ఎస్టీ 2.0తో నిర్మాణ రంగానికి ఊతం లభించిందని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వర్ అన్నారు. సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సామాన్యుల సొంతింటి కల సాకారానికి జీఎస్టీ సంస్కరణలు దోహదపడతాయని అన్నారు. సిమెంట్‌పై గతంలో 28 శాతంగా ఉన్న జీఎస్టీని 18 శాతానికి, ఇసుక, టైల్స్‌పై ఉన్న 12శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించారన్నారు. వీటితో పాటు గ్రానైట్, మార్బుల్, రంగులు వంటి వాటిపై జీఎస్టీ తగ్గిందన్నారు. సాధరణం ఇంటి నిర్మాణంలో సామాగ్రిలో అయ్యే ఖర్చులో 10-15శాతం ఆదా అవుతుందన్నారు. అనంతరం భవన నిర్మాణదారుల అభిప్రాయాలను సేకరించారు.కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్రటరీ శైలజావల్లి, డీసీ ఎస్.వెంకటరమణ, ఇన్‌చార్జి ఎస్ఈ రీటా, డిప్యూటీ సీపీలు నాయుడు, శ్రీనివాస్, ఈఈ మదార్సాఅలీ, పలువురు భవన నిర్మాణదారులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం

స్థానిక సీతంపేటలో మంగళవారం రాత్రి జరిగిన సూపర్ జీ ఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచార కా ర్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వా సు ఇంటింటికీ, చిరు దుకాణాలకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తున్నారన్నారు. 12 నెలలు శ్రమించి నేషనల్ పాలసీల్లో కూడా మార్పులు చేయించి 2లక్షల మందికి ఉపాధి కల్పించి రూ1.33 పెట్టుబడులను పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి లోకేశ్ కృషి అభినందనీయమన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణను మాటలకే పరిమితం చేయకుండా శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. దేశం మొత్తం గర్వి చదగ్గ కార్యక్రమం జరుగుతుంటే వైసీపీ వాళ్లు గూగుల్ క్లౌడ్ సంస్థకు భూములివ్వకుండా అడ్డు పడి ఈ సంస్థపై కూడా తప్పుడు ప్రచారం చేసేందుకు కుట్ర చేయడం దుర్మార్గమని ఎమ్మెల్యే వాసు మండిపడ్డారు.

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ తేతలి సుమ జీఎస్టీపై కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ నాలుగు శ్లాబులుగా వున్న దానిని రెండు శ్లాబులుగా మార్చడం వల్ల అన్ని వర్గాలకు మేలు జరిగి వారిలో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. అనంతరం ఇటీవల వి.సావరంలో జరిగిన పేలుడు ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి సత్యగౌరి,ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కా ర్పొరేషన్ డైరెక్టర్ బేరా వేణమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, పలువురు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అనపర్తి: సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగం గా అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ముందుగా జీఎస్టీ ద్వారా ధరలు తగ్గిన వివిధ వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఉత్పత్తితోపాటు వ్యాపారులకు అమ్మకాలు పెరుగుతాయన్నారు. కేన్సర్ సంబంధిత మందుల ధరలు తగ్గాయన్నారు. ట్రాక్టర్ల ధరల్లో రూ.70 వేల నుంచి రూ.1 లక్ష వరకు తగ్గింపు లభించిందన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అన్నారు. ముందుగా ఇటీ వల రాయవరంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతులకు సమావేశం నివాళులర్పించింది. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజా రమేష్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, నాయకులు రావాడ నాగు, కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి, కర్రి సత్యగౌరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సీతంపేటలో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు



బిక్కవోలులో తీర్మానం ప్రవేశపెడుతున్న ఎంపీపీ సుమ


అనపర్తిలో ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

ప్రజాభీష్టం మేరకు రేషన్ దుకాణాల ఏర్పాటు

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఊరికి దూరంగా ఉన్న కాలనీ వాసులు రేషన్ తీసుకునేందుకు పడుతున్న ఇబ్బందులను గుర్తించి మండలంలో రెండుచోట్ల ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాలను మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. పీరా రామచంద్రపురం శివారు సింగరాయకాలనీ,అనపర్తి శివారు కొత్తూరులో రేషన్ కోసం ప్రజలు ప్రధా న గ్రామానికి రావలసిన అవసరం లేకుండా నెలలో రెండు రోజుల పాటు ఆయా కాలనీల్లోనే రేషన్ ఇచ్చే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు రెండు చోట్ల దుకాణాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే కొత్తూరు కాలనీకి వెళ్లే మార్గం చీకటిమయంగా ఉండడం, కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఎమ్మెల్యే కాలనీ వరకు విద్యుద్దీపాల ఏర్పాట్లు చేశారు. వీటిని సర్పంచ్ వారా కుమారి చేతుల మీదుగా ప్రారంభించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తేతల సుధాకరరెడ్డి, ద్వారంపూడి తాతారెడ్డి, కర్రి బులిరెడ్డి, కర్రి శేషారత్నం, సుభాషిణి, తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడు అప్పారావు మృతికి ప్రెస్‌క్లబ్ సంతాపం



అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు అడపా అప్పారావు మృతి జర్నలిజానికి తీరని లోటని పలువురు సీనియర్ పాత్రికేయులు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం అడపా అప్పారావు సంతాపం సభ నిర్వహించారు. జర్నలిజంలో నైతిక విలువలు పాటిస్తూ ఎందరో జర్నలిస్టులను అప్పారావు ప్రోత్సహించారని గుర్తుచేశారు. తొలుత అప్పారావు చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, సీనియర్ పాత్రికేయులు జీపీ భూషణ్‌బాబు, పి.నవీన్, వీఎస్ఎస్ కృష్ణకుమార్, శైలేంద్ర, మండేల శ్రీరామమ్మూర్తి, కుడుపూడి పార్థసారధి, సన్నిదానం శాస్త్రి, దేవులపల్లి రామలింగం పువ్వులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఎనుముల విశ్వనాథం, సత్య, రామకృష్ణ, సతీష్, రత్నకిషోర్, సోమరాజు, వీడియో జర్నలిస్ట్ కిషోర్, రసూల్, ఫొటో జర్నలిస్టులు బి.రాజేశ్వరరావు(బాబి), సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ బౌద్ధ దమ్మ స్వీకరణ దినోత్సవం



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ దమ్మ స్వీకరించిన రోజును రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిటీఆర్ఐ రోడ్డులోని బుద్ధవనం పార్కులో జరిగిన ఈ కార్యక్రమంలో గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ విగ్రహాలకు ప్రముఖ న్యాయవాది మర్రి బాబ్జి, కాశి నవీన్‌కుమార్ పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం బాబ్జి నివాసంలో బుద్ధవనం కార్యక్రమం నిర్వహించి ప్రబుద్ధ భారత్ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాసకులు సీహెచ్ సుబ్బారావు, కొంకి రమేష్‌లతోపాటు మర్రి అనిత, విప్పర్తి రమేష్ కృష్ణ, విప్పర్తి పద్మ, దియ్యన ఠాగూర్, ఆర్.బాల శ్రీధర్, జీఎస్ మూర్తి, కె.ప్రశాంత్‌కుమార్, కె.రామ్మోహనరావు పాల్గొన్నారు.

బలభద్రపురం శివాలయాన్ని దర్శించిన మాజీ ఎమ్మెల్యే

బిక్కవోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలో నూతనంగా నిర్మించిన శివాలయాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు దర్శించారు. ఈ సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగాలకు, అష్టాదశ శక్తిపీఠ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్, బీసీఎన్-సీసీసీ సంయుక్త ఆధ్వర్యంలో కేబుల ఆపరేటర్లకు, జర్నలిస్టులకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆనం రోటరీ హాలులో మంగళవారం హైదరాబాద్ యశోదా ఆసుపత్రి ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సోమశేఖర్, కోట్ల తేజ గ్యాస్ట్రిక్, లివర్ వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పంతం కొండలరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆకుల వీర్రాజు, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, యెనుముల రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ గుండెపోటుతో మృతి

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుకుంపేట పంచాయతీలో ట్రాక్టరు డ్రైవరుగా పనిచేస్తున్న పసలపూడి ప్రసాద్(55) గుండె పోటుతో మృతి చెందాడు. సోమవారం సాయంత్రం విధులు నిర్వర్తిస్తుండగా ఛాతిలో నొప్పి రావడంతో సూపర్‌వైజర్ అతడిని వారి ఇంటి వద్ద దిగబెట్టారని సిబ్బంది చెబుతున్నారు. ఆ తర్వాత కుటుంబీకులు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారని చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు.గుండెపోటు రావడంతోనే ప్రసాద్ మృతిచెందాడని డాక్టరు చెప్పినట్టు తోటి సిబ్బంది చెబుతున్నారు. ప్రసాద్‌కు గుండెపోటు వచ్చిన వెంటనే ఇంటికి కాకుండా నేరుగా ఆసుపత్రికి తరలించివుంటే బతికివుండేవాడని బంధువులు అంటున్నారు. దీనిపై విచారణ జరిగిపి తమకు న్యాయం చేయాలంటూ బంధువులు ప్రసాద్ మృతదేహన్ని పంచాయతీ కార్యాలయం వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. పంచాయతీ అధికారులు, యూనియన్ నాయకులు కార్మికుల పీఎఫ్ కొన్ని నెలలుగా చెల్లించకపోవడంతో పీఎఫ్ సొమ్ములు కూడా వచ్చే మార్గం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికుడు ప్రసాద్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

రాష్ట్రంలో ఏరులై పారుతున్న నకిలీ మద్యం

జక్కంపూడి విజయలక్ష్మి.. కోరుకొండ ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైసీపీ నిరసన


ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న వైసీపీ శ్రేణులు

కోరుకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని వైసీపీ కేంద్ర కమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆరోపించారు. నకిలీ మద్యంపై ర్యాలీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం భారీ ర్యాలీ చేపట్టారు. కోరుకొండ ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. నకిలీ మద్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడారు. రాష్ట్రంలో స్పిరిట్, రసాయనాలతో తయారు చేసిన నకిలీ మద్యాన్ని పాపులర్ బ్రాండ్‌లు తలపించేలా బాటిల్స్‌పై లేబుల్స్ అతికించి సరఫరా చేస్తున్నారని, ఒక్క ఏడాదిలోనే రూ.5280 కోట్లు టీడీపీ ముఠా దోచుకుందనే ప్రచారం సాగుతోందన్నారు. నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు బ్రాందీ షాపులు, పర్మిట్ రూమ్‌లు, బార్‌లు, బెల్ట్‌షాపుల్లో ఎక్సైజ్ శాఖ తనిఖీలు చేయాలని, సీబీఐతో దర్యాప్తు జరిపించాలని విజయలక్ష్మి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంటే విజయ్ తేజ, నక్కా రాంబాబు, తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, రమాదేవి, కర్రి నాగేశ్వరరావు, పిట్టా కృష్ణ, కొండపల్లి దుర్గారావు, వైస్ ఎంపీపీ బొరుసు బద్రి, నల్లబోలు భాస్కర్ పాల్గొన్నారు.

ఆర్‌టీఐ అవగాహన బోర్డులు ఏర్పాటు చేయండి


ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న సీసీఆర్ ప్రతినిధులు

బిక్కవోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోను సమాచార హక్కు చట్టం అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలని సోమవారం కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ ప్రతినిధులు ఎంపీడీవో వి.శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌టీఐ యాక్ట్ అమలులోకి వచ్చి ఇరవై ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈబోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్ఐ రవిచంద్రకుమార్, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంఈవో సత్యనారాయణ, సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రాలు ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీసీఆర్ ప్రతినిధులు బి.శ్రీనివాస్, వి.శ్రీనివాస్, డి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రాజానగరంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



రాజానగరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో మంగళవారం రాజానగరంలో త్రైత సిద్ధాంత భగద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ వేదిక సభ్యులు మాట్లాడుతూ గురువు తన జ్ఞానాగ్నితో శిష్యుల తలలో జ్ఞాన జ్యోతి వెలిగించి యోగ మార్గంలో నడిపిస్తాడనడానికి గుర్తుగా దీపావళి రోజున ఇంట్లో దీపాలు వెలిగించాలన్నారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం అధ్యక్షుడు శేఖర్‌బాబు, మూర్తి, లక్ష్మీనారాయణ, జయరాం, విజయ్, సూర్యకుమారి,రాణి, సంధ్యారాణి, లోహిత, సన్నిధి, సాత్విక్ పాల్గొన్నారు.

అనపర్తిలో బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్టు

అనపర్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అనపర్తిలో అక్రమంగా మద్యం విక్రయిస్తూ బెల్ట్ షాపు నిర్వహస్తున్న కర్రి సత్తిరెడ్డి అనే వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి అతడి నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. అనుమతులు లేకుండా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరుచనున్నట్లు ఆమె తెలిపారు.

చర్చిలో చోరీ

గోకవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణునిపాలెం శివారునున్న ఆర్అండ్ఆర్ కాలనీలోని షాలోమ్ ప్రార్థన మందిరంలో సోమవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. చర్చి తలుపులు పగులగొట్టి సుమారు రూ.లక్ష విలువజేసే మైక్ సెట్ బాక్సులను, ఇతర సామగ్రిని అపహరించారు. చర్చి సభ్యు లు మంగళవారం ఉదయం వెళ్లి చూడగా తలు పులు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్టు నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దేవాదిదేవా.. శ్రీవాసుదేవా



దేవాదిదేవా.. వాసుదేవా అంటూ వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని భక్తజనం కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదో రోజైన మంగళవారం ఆలయంలోని వసంత మండపంలో ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని కన్నులారా చూసి మనసారా వేడుకున్నారు.. మంగళవారం రాత్రి మలయప్ప అలంకరణలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు..

6

చిన్ననాటి కోరిక తీరింది!

రిటైర్డ్ జస్టిస్ రమణ



వేద సభల్లో పాల్గొనాలనే కోరిక చాలా మందికి ఉంటుంది.. కానీ ఆ అవకాశం కొంత మందికే వస్తుంది.. అలాగే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు ఆ కోరిక ఉంది. అంబాజీపేట మండలం నందంపూడిలో మంగళవారం నిర్వహించిన వేద సభలో అవకాశం వచ్చింది. దానిలో భాగంగా ఆ కోరికను బయటపెట్టారు. తనకు చిన్నప్పటి నుంచి వేదసభలో పాల్గొనాలనే కోరిక ఉండేదని.. తాను నందంపూడి వేదసభలో పాల్గొని వేదఘోషను ఆస్వాదించడంతో నెరవేరిందని అన్నారు. వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందానని వెల్లడించారు. -అంబాజీపేట.



మార్కెట్లోకి కల్తీ మద్యం తెచ్చింది జగనే

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మద్యం విషయంలో పారదర్శకంగా పనిచేస్తుంటే వైసీపీ నాయకులు బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యపాన నిషేధం విధిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరిచారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కల్తీ మద్యం కారణంగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నవోదయం 2.0 ద్వారా నాటుసారాను పూర్తిగా నిర్మూలించామన్నారు. దాదాపు 21 జిల్లాలు నాటుసారా రహిత జిల్లాలుగా మార్చామని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో తప్పుడు పనులు చేసేవారిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లితే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

మద్యం దుకాణాలపై నిరంతర నిఘా

సూపరింటెండెంట్ లావణ్య

రాజమహేంద్రవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం తయారీ, రవాణా, అనుమతి లేని మద్యం విక్రయాలపై పటిష్ఠ నిఘా పెట్టామని.. నిరంతర దాడులు చేస్తున్నామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్.లావణ్య పేర్కొన్నారు.నకిలీ మద్యం అరికట్టాలంటూ వైసీపీ నాయకులు వివిధ ఎక్సైజ్ స్టేషన్లకు వెళ్లి వినతి పత్రాలు అందజేయడంపై ఆమె స్పందించారు. జిల్లాలోని 7 ఎక్సైజ్, ఈఎస్ టాస్క్ ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు సమన్వయంతో అన్ని ప్రాంతాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తున్నాయన్నారు. 138 మద్యం దుకాణాలు, 20 బార్లలో నాణ్యత తనిఖీలు ఎక్సైజ్ నిరంతరం జరుగుతున్నాయన్నారు. గతేడాది అక్టోబరు 16 నుంచి ఇప్పటి వరకూ 574 నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించామని, ఎలాంటి కల్తీ మద్యం ఆనవాళ్లు లభించలేదన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్ మూతపై ఉన్న సీల్‌ను స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ఎక్కడైనా నకిలీ మద్యం ఆనవాళ్లు ఉంటే వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 14405కి సమాచారం చేరవేయాలన్నారు. అవసరమైతే సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.




రాష్ట్రంలో నాలుగు చోట్ల క్రీడా స్టేడియంలు నిర్మిస్తాం

శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్

దేవరపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగుచోట్ల క్రీడా స్టేడియంలు ఏర్పాటు చేస్తామని శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. దేవరపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కుప్పం, విజయనగరం, పాయకరావుపేటల్లో క్రీడా స్టేడియంలు ఏర్పాటు చేస్తామన్నారు. కడపలో ఉన్న క్రీడాస్టేడియంలో 400 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విజయనగరంలో 60 ఎకరాల్లో క్రీడాస్టేడియం నిర్మిస్తున్నట్టు తెలిపారు. దేవరపల్లి హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన క్రీడా రికార్డు కేంద్రం పూర్తి చేస్తామని తెలిపారు.తిరుపతి, నెల్లూరు, కాకినాడ, విశాఖపట్నంలో స్టేడియంలు నిర్మించి జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికయ్యే విధంగా క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.2025 డీఎస్సీలో దేవరపల్లి మండలానికి చెందిన నా శిష్యులు 14 మంది వ్యాయామోపాధ్యాయులుగా ఎంపికవడం ఆనందంగా ఉందని తెలిపారు.

విజిలెన్స్‌కీ.. చిక్క లేదు!



బూరుగుపూడి ఆవ..అక్రమాల త్రోవ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అవినీతి జరిగింది.. జనం సొమ్ము సుమారు రూ.150 కోట్లు వైసీపీ నాయకులు హవాలా కంటే తెలివిగా దోచేశారు. కానీ ఇప్పుడు ఆ అక్రమాలను నిరూపించడంలో మాత్రం అధికారులు చేతులెత్తేస్తున్నారు. దోపిడీ లెక్కల్లో కూడా పక్కాగా వ్యవహరించడంతో ఒక్క ఆధారం విజిలెన్స్‌కి చిక్కడం లేదు. వాటాల్లో తేడాలతో సాక్షాత్తూ అప్పటి వైసీపీ ఎమ్మెల్యే, వైసీపీ ఎంపీ ఒకరిపై ఒకరు బహిరంగంగానే భూముల బురదను జల్లుకున్నారు. కానీ ఇప్పుడు ఆ అక్రమాలను నిరూపించడంలో మాత్రం అధికారులు తంటాలు పడుతున్నారు.విజిలెన్స్ సైతం సైలెన్స్ అయిపోయింది. అప్పట్లో ఆరోపణలు చేసుకున్న వైసీపీ నాయకులను ఎందుకు ప్రశ్నించడం

- పక్కాగా 'ఆవ' పెట్టేసిన వైసీపీ
- ఒక్క ఆధారం దొరక్క తంటాలు
- రూ.150 కోట్ల భూసేకరణ స్కాం
- పేదల ఇళ్లస్థలాల పేరిట దోపిడీ
- అప్పట్లో సంచలనం
- కూటమి వచ్చినా తేలని వైనం

లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా రాజానగరం,కోరుకొండ మండలాల్లోని ఆవ భూముల్లో దర్యాప్తు జావ కారిపోతోంది. ఆవలోని అవినీతిని తవ్వి ఎలుకను పట్టలేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.స్థానిక ప్రజాప్రతినిధులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో మళ్లీ ఫైలు బూజు దులిపే అవకాశం కనిపిస్తోంది.

రూ.210 కోట్లు చెల్లించి

1800 ఎకరాల భూసేకరణ చేయాలని నిర్ణయించారు. చివరికి 586 ఎకరాలు సేకరించారు. రైతుల నుంచి పత్రాలు తీసేసుకున్నారు. ఆరోపణలు వెల్లువెత్తడంతో 200 ఎకరాల పత్రాలను రైతులకు తిరిగిచ్చేశారు. నికరంగా రాజానగరం,కోరుకొండ మండలాల్లో 386 ఎకరాలకు రూ.45 లక్షల నుంచి రూ.60 లక్షల చొప్పున ప్రభుత్వం రైతులకు చెల్లించింది. సుమారు రూ.40 కోట్లు విలువ చేసే ఆవ భూములను రూ.210 కోట్లు చెల్లించి కొన్నారు. ఇవి ముంపు భూములని జల వనరుల శాఖ సైతం ధ్రువీకరించింది. గోదావరికి వరదలు వచ్చినప్పుడు 15-20 అడుగుల మేర నీరు నిలిచిపోతుంది. ఎలా చూసినా ఈ భూములు నివాస యోగ్యం కాదు.ఈ స్కాంలో అప్పటి వీఆర్వో నుంచి కలెక్టర్ వరకూ తలో చెయ్యి వేశారు.

కథ ఇలా మొదలు..

వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వ భూముల అవసరత ఏర్పడింది. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, రాజానగరం మండలాల పరిధిలోని 40 వేల మంది లబ్ధిదారులకు స్థల సేకరణ చేయాలని నిర్ణయించారు. 2020 మే 18న రెవెన్యూ శాఖ ప్రైవేటు భూముల సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ముంపు భూములు పనికిరావని షరతు విధించింది. అయినా ఎందుకూ పనికిరాని ఆవ ముంపు భూములే సేకరించేలా ప్రభుత్వానికి అప్పటి అధికారులు నివేదిక ఇచ్చేశారు. పక్కా ప్లాన్ ప్రకారం అవినీతికి తెరలేపారు. అప్పట్లో సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం ఎకరం రూ.7.2 లక్షలు ఉంది. మార్కెట్ విలువ ఇంకాస్త ఎక్కువ ఉంటుంది. అయినా సరే వరదొస్తే మునిగే భూములను ఎవరు కొంటారు. సబ్ రిజిస్ట్రార్ ధరకు ఆ భూములను కొనడానికి ముందుకు రాని పరిస్థితి ఉంది. దీనిని వైసీపీ నేతలు అక్రమ సంపాదనకు అవకాశంగా మలుచుకొన్నారు.

గంపగుత్తగా ఉండడంతో..

ఇక్కడి భూముల్లో అధికశాతం వస్త్ర వ్యాపారులు, వేరే జిల్లాలోని ఒకే సామాజిక వర్గానికి చెందిన వాళ్లవి గంపగుత్తగా ఉన్నాయి. ఇంకేముంది! వైసీపీ నేతలు రంగంలోకి దిగి వాళ్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఎకరా రూ.10 లక్షలకు కొనడానికి ఎవరూ ముందుకు రాని భూములను కొంటామనడంతో యజమానులు ఎగిరి గంతేశారు. ఎకరాకు రూ.45 లక్షల నుంచి రూ.60 లక్షల వరకూ ఇప్పిస్తామని చెప్పడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.వైసీపీ నాయకులతో మౌఖిక ఒప్పందాలు చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వమే అండగా ఉండడంతో ఆనాటి అధికారులు కూడా దూడూ బసవన్నలు అయిపోయారు. రాజమహేంద్రవరం మాజీ ఎంపీ భరత్, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరుల బహిరంగ పంచాయతీలు నాటి సీఎం జగన్ వరకూ వెళ్లాయి.

పక్కా వ్యూహం..

విదేశాలకు హవాలా సొమ్ముల తరలింపు, మనీ లాండరింగ్‌లో కూడా ఇంత పక్కా వ్యూహంతో అవినీతి జరగదు. మార్కెట్ ధర కంటే కూడా మూడింతలు ఎక్కువగా ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశారు. రూ.45 లక్షల్లో రూ.25 లక్షలు రైతుకు, రూ.20 లక్షలు వైసీపీ గెద్దలకు, అధికార గణానికి పంపకాలు చేశారు. ఈ భూముల యజమానుల్లో అధికశాతం మోతుబరులే. ఏడాదికి కోట్లలో టర్నోవర్ చేసే వ్యాపారాలు ఉన్నాయి. దీంతో ఒక్క రూపాయి కూడా అక్రమార్కులకు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరపలేదు. ప్రభుత్వం పరిహారంగా రైతులకు ఇచ్చిన సొమ్ములు కాబట్టి పన్నులు ఉండవు. వాళ్ల అకౌంట్ల నుంచి రూ.50 వేల నుంచి లక్షల రూపాయలు విత్‌డ్రా చేసినట్టు బ్యాంకు స్టేట్‌మెంట్లలో ఉంది. వేరే కంపెనీలకు బదలాయించినట్టు కూడా ఉంది. అక్కడి నుంచి డబ్బులు డ్రా చేసి వైసీపీ నేతలకు ఇచ్చారు. విజిలెన్స్ అధికారులు బ్యాంకు అకౌంట్లు తదితర రికార్డులు పరిశీలించి హతాశులయ్యా రు.ఫైలును పక్కన పెట్టేశారు.కోట్లాది రూపాయల అవినీతిలో ఒక్క ఆధారాన్ని పసిగట్టలేకపోతున్నారు.

సీఐడీ దర్యాప్తు చేయాలి?

విజిలెన్స్ వద్ద ఫైలు పడకేయడంతో ఈ కేసును సీఐడీ లేదా అంతకంటే పెద్ద దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని స్థానిక ప్రజాప్రతినిధులు సీఎం చంద్రబాబును కోరడం గమనార్హం.మరోవైపు తమ భూములు కొనే వాళ్లే లేని పరిస్థితుల్లో మూడింతల సొమ్ము అదనంగా ఇచ్చి కొనడంతో ఆయా రైతులు నోరు మెదపడం లేదు.ఎవరైనా సాక్ష్యం చెప్పినా,స్టేట్‌మెంట్ ఇచ్చినా వాళ్లకు కూడా అవినీతి కేసులు చుట్టుకుంటాయని, అదనంగా ప్రభుత్వం ఆ రోజున చెల్లించిన సొమ్ము వెనక్కి ఇచ్చేయాల్సి వస్తుందని వైసీపీ నేతలు ఇప్పటికే రైతులు, స్థానికులను భయపెట్టారు. దీంతో అందరూ కుక్కిన పేనుల్లా కిమ్మనడం లేదు.ఎవరైనా ముందుకు వచ్చి తమ వివరాలను గోప్యంగా ఉంచడంపై హామీ తీసుకొని నిజాలు వెల్లడిస్తే వైట్ కాలర్స్ దోపిడీ సొమ్ము తిరిగి ఖజానాకు చేరే అవకాశం ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి, జేసీ మేఘాస్వరూప్

స్టాక్ పాయింట్లలో ఇసుక 8.19 లక్షల టన్నులు

శాండ్ కమిటీ సమీక్షలో కలెక్టర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భవన నిర్మాణాలకు కావాల్సినంత ఇసుక అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. స్టాక్ పాయింట్లలో 8.19 లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉందని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, గోదావరి వరదల కారణంగా జూన్ 1 నుంచి ఈ నెల 15వ తేదీ వరకూ ఇసుక తవ్వకాలు నిలిపివేశామని తెలిపారు. ప్రస్తుతం డీసిల్టేషన్ ర్యాంపులు మొదలయ్యాయని, ఓపెన్ రీచ్‌లకు కొంత సమయం పడుతుందన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచే ఓపెన్ రీచ్‌లలో ఇసుక తవ్వుకోవచ్చని..కానీ వరదల దృష్ట్యా ర్యాంపులలో ఇసుక తీసే పరిస్థితి లేదన్నారు. జిల్లా పరిధిలోని 29 స్టాక్ పాయింట్లలో మొత్తం 9,96,736 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ చేయగా ఇప్పటి వరకూ 5,20,397 టన్నుల ఇసుక వినియోగించారన్నారు.ఇంకా 4,76,339 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇతర జిల్లాలకు కేటాయించిన 8 స్టాక్ పాయింట్లలో 3,92,434 మెట్రిక్ టన్నుల్లో ఇప్పటికి 49,914 మెట్రిక్ టన్నులు వినియోగించగా 3,42,520 మెట్రిక్ టన్నుల ఇసుక ఉం దన్నారు. జిల్లాలో ఇంకా 8.19 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా, అధిక లోడు వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెడ్జింగ్ అపరేషన్లను కట్టడి చేయాలని చెప్పారు. ఇప్పటి వరకూ 247 వాహనాలను బ్లాక్ లిస్ట్‌చేసి రూ.80లక్షలు జరిమానాలు విధించామని, 1,675 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేశామన్నారు. జిల్లాలో 35 డ్రెడ్జింగ్ బోట్లు, 27 సాధారణ బోట్లు, మూడు ఎక్స్‌కవేటర్లను గుర్తించి కేసు నమోదు చేశామని చెప్పారు. సమావేశంలో జేసీ వై.మేఘ స్వరూప్, అదనపు ఎస్పీ డి. మురళీకృష్ణ, జిల్లా మైన్స్ అధికారి డి. ఫణిభూషణ్‌రెడ్డి,ఆర్డీవోలు ఆర్. కృష్ణనాయక్, రాణి సుస్మిత, పీసీబీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.శంకరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బివిగిరి తదితరులు పాల్గొన్నారు.

'భారీగా టపాసులు నిల్వచేస్తే కేసులు పెట్టండి'

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో ఇంటి వద్ద భారీగా టపాసులు నిల్వలు చేస్తే గుర్తించి కేసులు నమోదు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం జిల్లా, క్షేత్రస్థాయి విభాగాధిపతులతో వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. దీపావళి నేపథ్యంలో షాపుల అనుమతులు, భద్రత చర్యలపై పలు ఆదేశాలిచ్చారు. దీపావళి హోల్‌సేల్ దుకాణాలకు సంబంధించిన దరఖాస్తులు రెవెన్యూపోలీస్, ఫైర్ శాఖల అధికారులతో కూడిన కమిటీ ద్వారా పరిశీలించి అనుమతులివ్వాలని ఆదేశించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసే స్టాల్స్ వద్ద భద్రత చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పీజీఆర్ఎస్‌కు వచ్చిన 2500 అర్జీలపై చర్చించారు. రైతు వారీగా పంటల దశల ప్రకారం ఎరువుల వినియోగం సమయ పట్టిక సిద్ధం చేయాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. భాస్కరరెడ్డి, సీపీవో ఎల్.అప్పలకొండ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డీసీవో ఎం.వెంకటరమణ, డీపీవో వి.శాంతమణి, డ్వామా పీడీ ఏ.నాగమహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజానంద.. పవనాలు!



ఉప్పాడలో గురువారం జరిగిన సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ (ఫైల్‌ఫొటో)

డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.. నెరవేర్చారు

- సెజ్ రైతులకు న్యాయం
- 2,180 ఎకరాలు ఇచ్చేలా జీవో
- రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు
- 1551 మంది రైతుల ఆనందం
- బోట్లకు రూ.72 లక్షల పరిహారం

కొత్తపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ నాడు హామీ ఇచ్చారు.. అది నేడు నెరవేర్చారు. కేఎస్ఈజెడ్ (కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి) పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించేలా బాధ్యత తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ఆ హామీని డిప్యూటీ సీఎం హోదాలో నిలబెట్టుకున్నారు. కాకినాడ సెజ్‌కు ఇచ్చిన భూముల్లో 2,180 ఎకరాలను తిరిగి రైతులకు ఇచ్చి మేలు చేయాలని ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు సెజ్‌లో అవార్డు భూములను తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ఈ రిజిస్ట్రేషన్‌కు రుసుములు, స్టాంపు డ్యూటీలు వసూలు చేయవద్దని ఆదేశాలిచ్చారు. దీంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో 1551మంది రైతులకు మేలు చేకూరనుంది.

సెజ్ రైతులకు ఊరట..

కాకినాడ సెజ్ పరిధిలో రైతులకు వెనక్కిచ్చిన భూమి తిరిగి రైతుల పేరున రిజిస్ట్రేషన్ కాక సతమతమవుతున్నారు. దీంతో డిప్యూటీ సీఎం గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిచేస్తూ రైతులకు న్యాయం చేశారు. గత ప్రభుత్వంలో కేఎస్ఈజెడ్ భూములపై జీవోనెం.12 విడుదలైనా క్షేత్ర స్థాయిలో రైతులకు మేలు జరగలేదు. దీంతో పిల్లల పెళ్లిళ్లు, చదువుల నిమిత్తం భూములు ఉపయోగపడడంలేదని రైతులు గతంలో పవన్‌కల్యాణ్‌కు నివేదించారు. దీంతో మేలు జరిగేలా చూస్తానని అప్పట్లో రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమస్యను ఇటీవల శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వ విప్ గిడుగు హరిప్రసాద్ కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్య మరోసారి చర్చనీయాంశమైంది. మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వం కాకినాడ సెజ్ రైతులకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీని మినహాయించి తిరిగి రైతుల భూములు వారికి తిరిగి రిజిస్ట్రేషన్ చేసేలా ఆదేశాలిచ్చింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

దెబ్బతిన్న బోట్లకు రూ.72 లక్షల పరిహారం

గురువారం సభలో హామీ ఇచ్చి.. నెరవేర్చిన పవన్

కొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ మినీహార్బర్ వద్ద దెబ్బతిన్న మత్స్యకారుల బోట్లకు ప్రభుత్వం రూ.72 లక్షల నష్టపరిహారం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. నాలుగు రోజుల కిందట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మత్స్యకారుల సమస్యలు తెలుసుకునేందుకు కాకినాడ వచ్చారు. అక్కడ కలెక్టరేట్‌లో మత్స్యకార ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఉప్పాడ హార్బర్ డిజైన్ లోపం కారణంగా తమ బోట్లు దెబ్బతిన్న విషయాన్ని మత్స్యకారులు ఆయన దృష్టికి తీసు కెళ్లారు. ఉప్పాడలో జరిగే సభకు వెళుతూ విహంగ వీక్షణం ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హార్బర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. బోట్లు నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం డిప్యూటీ సీఎం చొరవతో హార్బర్‌లో దెబ్బతిన్న బోట్లకు రూ.72 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మత్స్యకారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

భూముల బదిలీకి ఫీజుల్లేవు

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ)/కొత్తపల్లి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్ఈజెడ్ భూములను రైతుల పేరున బదిలీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇచ్చిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం తెలిపారు. ఈ మినహాయింపు 1899 స్టాంపు చట్టం సెక్షన్9 (1)(ఏ), 1908 రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 78 ప్రకారం అమలుచేస్తారని ప్రభుత్వం తెలిపిందన్నారు. ఈ మినహాయింపు రైతుల భూమి బదిలీలకు మాత్రమే వర్తిస్తుంది.

పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం

కొత్తపల్లి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): సెజ్ భూములు తిరిగి రైతులకే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని అధికారిక ప్రకటన వెలువడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్ ఫ్లెక్సీలకు మువ్విడివారిపాడు, రావివారిపోడు గ్రామాలతోపాటు పొన్నాడ శివారు మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద సెజ్ రైతులు పాలాభిషేకాలు చేశారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, తెలగంశెట్టి శ్రీనివాసరావు, పిల్లా శివశంకర్, బాపన్నదొర పాల్గొన్నారు.





ఉదయ్‌పూర్‌లో పర్యాటకశాఖ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా

తిరుపతి, విశాఖపట్టణాలను గుర్తించండి

● మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): దేశ పర్యాటక రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. మంగళవారం రాజస్థాన్‌లో ఉదయ్‌పూర్‌లో జరిగిన కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రుల సమావేశం నిర్వహించారు. అక్కడ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దుర్గేష్ కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు ఏపీ పర్యాటక రంగాన్ని విజ్ఞప్తి ఆయనకు విన్నవించినట్టు కందుల దుర్గేష్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆయన ఫోన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విశాఖపట్టణాలను పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు కేంద్రం సహకరించాలని ఆయన కోరినట్టు తెలిపారు. జాతీయ మిషన్‌లో భాగంగా విశాఖపట్టణం, తిరుపతిలను ప్రధాన గమ్యస్థానాలుగా ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. ఏపీలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 15 నెలల కాలంలో పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తుందని, కొత్తది రూపాయలతో ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. పర్యాటకరంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రథమ స్థానంలో నిలుపుతామన్నారు. ఉదయపూర్‌లో జరుగుతున్న 2 రోజుల కేంద్రపర్యాటక సమావేశాల్లో అనేక అంశాలపై చర్చిస్తున్నామని ఏపీకి కేంద్ర సహకారం అందిస్తుందన్నారు.

మహిళల పొదుపులో సీఏల పాత్ర కీలకం

● నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి

గోపాలపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మహిళల స్వయం సహాయక సంఘాల మహిళల పొదుపులో సీఏల పాత్రకీలకమని నియోజకవర్గ తెలుగుమహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి అన్నారు. నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి ఆధ్వర్యంలో స్థానిక మండల సమాఖ్య కార్యాలయం వద్ద చంద్రబాబు చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి మాట్లాడుతూ డ్వాక్రా సీఏలు రద్దుపై గత ప్రభుత్వం చేసిన జీవోలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు రద్దు చేశారని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు తీసుకెళ్లాలని యోచించి గ్రామీణ నిరుపేదల అభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారని అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలను చైతన్య



గోపాలపురం మండల సమాఖ్య కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డ్వాక్రా సీఏలు

పరిచి సంఘాలుగా ఏర్పాటుచేసి వారి కష్టం లోంచి ఒక్కో రూపాయిని కూడగట్టి మహిళలను లక్షాధికారిగా చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఎటువంటి హామీ లేకుండా మహిళలకు వడ్డీలేని రుణాలతోపాటు ఉన్నతి, స్త్రీనిధి, విదేశీ విద్యకు పథకాలను అమలులోకి తెచ్చారన్నారు. దీని ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన లభించటంతో పాటు వారి పిల్లల చదువులకు తక్కువ వడ్డీతో రుణాలిచ్చి విదేశీ విద్య ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తుందన్నారు. ఏపీఎం రోజ్‌మాణిక్యం, మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు వడ్లమూడి రమేష్, సమన్వయ కమిటీ సభ్యులు వేములు నాగరాజు, గ్రామకమిటీ అధ్యక్షుడు బూరెడ్డి వాసు, జిల్లా శ్రీనివాసరావు, జిల్లా శ్రీధర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీనివాస్, డ్వాక్రా సీఏలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చింపేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఫ్లెక్సీ చింపేసిన వ్యక్తిపై కేసు నమోదు

గోపాలపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాయపాలెంలో వైసీపీ నాయకుడు పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపివేశారంటూ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. స్థానిక పోలీసులు గ్రామంలో విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

నకిలీ బంగారంతో మోసానికి యత్నించిన తల్లీకూతుళ్లపై కేసు

కొవ్వూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారంతో మోసం చేయడానికి ప్రయత్నించిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు పట్టణానికి చెందిన తల్లీకూతుళ్లు విజయవర్ధన హర్ సెంటర్‌లోని ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారం తాకట్టు పెట్టడానికి 7 బంగారు గాజులు, 1 బంగారపు చైను తీసుకువెళ్లారు. సిబ్బంది బంగారం తీసుకుని పరిశీలించగా నకిలీ బంగారం అని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముత్తూట్ ఫైనాన్స్ కొవ్వూరు బ్రాంచ్ మేనేజర్ పెద్దిరెడ్డి నాగలక్ష్మి అందించిన ఫిర్యాదుపై ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

దొమ్మేరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా సత్యనారాయణమూర్తి

కొవ్వూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా మురమళ్ళ సత్యనారాయణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం గ్రామకమిటీ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా మురమళ్ళ సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా నంబూరి వెంకట సుబ్బరాజు, జనరల్ సెక్రటరీగా జుజ్జువరపు నాగేశ్వరరావు, కోశాధికారిగా ఆకుల అప్పారావులతోపాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడిగా గారపాటి రామకృష్ణ, రంగారావు, యలమర్తి శ్రీరంగప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'నన్నయ'లో ఆహార మహోత్సవ ప్రదర్శన

దివాన్‌చెరువు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫుడ్ సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో ఆహార మహోత్సవ ప్రదర్శన జరుగుతుందని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్యానర్‌ను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. అలాగే ఆకడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలు వంటలు సిద్ధం చేసుకుని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, డి.కళ్యాణిఆర్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గోదావరి ఇరిగేషన్ ఎంప్లాయీస్ ఎన్నికలు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ఇరిగేషన్ ఎంప్లాయీస్ పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ ఎన్నికల షెడ్యూల్ ఎన్నికల అధికారి బీవీవీ సత్యనారాయణ ప్రకటించారు. అడ్‌హాక్ కమిటీ చైర్మన్ వి.వెంకటేశ్వరరావు, నలుగురు ఇతర సభ్యుల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. నామినేషన్లు ఈనెల 16వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు స్వీకరిస్తారని, 17న పరిశీలన, 18న ఉపసంహరణ సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పోటీ అనివార్యమైతే ఈనెల 25న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామన్నారు. పోలింగ్ ధవళేశ్వరంలోని ఎన్‌జీవోస్ భవనం ప్రాంగణంలో జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు.





కొవ్వూరులో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కరపత్రాలను చూపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, అధికారులు, పాలంగిలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు మేలు

కొవ్వూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేదప్రజలపై ఆర్థికభారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణలు తీసుకువచ్చిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత ముఖ్యఅతిథిగా పాల్గొని జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు కలిగే ఉపయోజనాలను వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కౌన్సిలర్లు కంటమని రమేష్ బాబు, పిల్లలమర్రి మురళీకృష్ణ, బొండాడ సత్యనారాయణ, కండెల్లి రామారావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాళం శ్రీనివాసరావు, నిడదవోలు జీఎస్టీవో కార్యాలయ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, పీకేపోర్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో టి.వి.వి.రమణ పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీపై అవగాహన చేసుకోవాలి

ఉండ్రాజవరం(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ పట్ల ప్రజలు అవగాహన చేసుకోవాలని ఎంపీడీవో ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పాలంగి గ్రామంలో సిమెంట్ షాపులు, ఇతర మాల్స్ వద్ద జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రకాల వస్తువులు, గూడ్స్, సిమెంట్ వంటి వాటికి జీఎస్టీని తగ్గించిందన్నారు. ప్రభుత్వం కల్పించిన జీఎస్టీ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో విజయ్ రామారావు, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్‌జానీ, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు సభ ఏర్పాట్లలో మన ఎమ్మెల్యేలు



కర్నూలులో జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

గోపాలపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేరుతో కర్నూల్ నగరంలో ఈనెల 16న జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్లలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నిమగ్నమయ్యారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించటంతోపాటు సూచనలు, సలహాలిచ్చారు. జేసీతో సాయంత్రం సమీక్ష చేయించారు. ఈసభకు ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ, మానవ వనరులశాఖ మంత్రి నారాలోకేశ్, ముఖ్యనేతలు హాజరవుతారన్నారు. రానున్న రెండురోజుల్లో పూర్తిస్థాయిలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తిచేయడంతో పాటు యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఎమ్మిగనూరు ఎమ్మెల్యేను కలిసిన ముప్పిడి

కొవ్వూరు(ఆంధ్రజ్యోతి): కర్నూలుజిల్లా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 16వ తేదీన కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభలో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ఏర్పాట్ల పర్యవేక్షణలో భాగంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకుడిగా నియమించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, బొల్లిన శివనాగేంద్రలు ఎమ్మిగనూరులో పర్యటించారు. ఎమ్మెల్యే బి.జయనాగేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువా కప్పి సత్కరించారు.

రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముప్పిడి

కర్నూల్ జిల్లా మంత్రాలయంలో మంగళవారం రాఘవేంద్రస్వామిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, బొల్లిన శివనాగేంద్ర, నాయకులు ఉన్నారు.

12 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

● తహశీల్దార్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్

ఉండ్రాజవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో 12ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. సార్వా సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలుపై మంగళవారం చిలకపాడులో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని 17శాతం తేమ ఉండేలా ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన వరి ఏ గ్రేడ్‌కు రూ.2389లు, కామన్ గ్రేడ్ నకు రూ.2369లు లభిస్తాయన్నారు. ఏవో బి.రాజారావు మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అనపర్తి సత్యనారాయణ, వీఆర్వో లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శివ, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

దేవరపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా దేవరపల్లిలో మూడుబొమ్మల సెంటర్‌వద్ద సౌభాగ్య దుర్గాదేవి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన మంగళవారం జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేకపూజా కార్యక్రమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ దుర్గారావు, భక్తులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో బ్యాంకు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరంఅర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏఐబీఈఏ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జరుగుతున్న ఆందోళనలకు మద్దతుగా మంగళవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని కరూర్ వైశ్యబ్యాంకు ఎదుట జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఎంప్లాయీస్ కో ఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ప్రైవేట్ బ్యాంకులను జాతీయకరణ చేయాలని, కరికల్ నియామకాలు జరపాలని,పెదరల్ బ్యాంకులో విలీనీకరణ రద్దు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ధర్నాలో బ్యాంకు ఉద్యోగులు సోమరాజు, మురళీధర్, స్వాతి, రమేష్, అప్పారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ



ఇంటింటికీ తిరిగి సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పెరవలి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో కాంగ్రెస్‌పార్టీ మాత్రమే ఉందని నియోజకవర్గ కోఆర్డినేటర్ మేడవరపు భద్రం‌దొర అన్నారు. పెరవలి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బుద్దన లక్ష్మణరావు అధ్యక్షతన పెరవలిలో బీజేపీ ఓట్ల దొంగ గద్దెదిగు అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పాలనలో మతోన్మాదం, దేశ సంపదను మోదీ కార్పొరేట్ యజమానులకు దోచిపెడుతున్నారని పనిగా అన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణ కుమారి, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీ కృష్ణ, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెన్మెట్స కోటేశ్వరరావు , దారపురెడ్డి సుజాత, పెన్మెట్స దరణీపతి, మాక రామాంజనేయులు పాల్గొన్నారు.

అంధకారంలో ప్రభుత్వ కార్యాలయాలు



చీకట్లోనే అవస్థలు పడుతూ ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు

తాళ్లపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర మైన తాళ్లపూడి ప్రభుత్వ కార్యాలయాలవద్ద వీధి లైట్లు లేక కార్యాలయాలకి వచ్చే ప్రజలు ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా రెవెన్యూ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాలు అన్నీ ఇక్కడే ఉన్నాయి. రాత్రి సమయంలో ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్‌స్టేషన్‌కి రాకపోకలు సాగుతుంటాయి. ఇదే సమయంలో వీధి లైట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ వారు లైట్లు ఏర్పాటు చేశారు. ఆ లైట్లు వెలగడం లేదు. దాంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇక్కడ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధనను అందించాలి

● ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ స్వాగతం



నూతన టీచర్లకు ఏపీటీఎఫ్ క్యాలెండర్ అందజేత

కొవ్వూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు చక్కటి బోధనను అందించాలని ఏపీటీఎఫ్ కొవ్వూరు పట్టణ అధ్యక్షుడు షేక్ నబీ అన్నారు. కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం మెగా డీఎస్సీ 2025 ద్వారా ఉద్యోగాలు పొంది విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్, ఏపీటీఎఫ్ క్యాలెండర్, సెలవు దరఖాస్తులు, జీవో పుస్తకాలను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నబీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అమలుచేయడం, విద్యార్థులకు చక్కటి బోధన అందించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ కొవ్వూరు పట్టణ కార్యదర్శి కె.బాలసుబ్బారెడ్డి, మహిళా అధ్యక్షురాలు వి.గంగభవాని, రాజరాజేశ్వరి, వందిరి శ్రీదేవి, లక్ష్మి, షేక్ జానీ మాస్టారు పాల్గొన్నారు.

ఇల్లు కట్టుకుందామని తెచ్చిన డబ్బు.. అగ్నికి ఆహుతి!

దూబచర్లలో ఇల్లు దగ్ధం - బూడిదైన రూ.6 లక్షల నగదు, బంగారం



దూబచర్లలో అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న ఇల్లు

నల్లజర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇల్లు కట్టుకుందామని తెచ్చిన సొమ్ము అగ్నికి ఆహుతవడంతో ఆ కుటుంబీకులు లబోదిబోమంటున్నారు. దూబచర్ల రావిచెట్టు సెంటర్‌లో మంగళవారం మధ్యాహ్నం రైతు కంచర్ల చిననాగు కు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది.కుటుంబసభ్యులు పొలం పనులకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టుగా భావిస్తున్నారు. ప్రమాద విషయం తెలియగానే భీమడోలు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. ఇల్లు కట్టుకోవడానికి రూ.7 లక్షలు అప్పుగా తెచ్చానని అందులో ఒక లక్ష ఖర్చుచేయగా మిగిలిన 6 లక్షలు, 4 కాసుల బంగారు ఆభరణాలు ఇంట్లో ఉంచగా.. అయితే అగ్నికి ఆహుతైనట్టు బాధితుడు చిననాగు తెలిపాడు. ఇప్పుడేం చేయాలి దేవుడా అంటూ కన్నీటిపర్యంతమయ్యాడు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్లకు ఐదవ విడత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలియజేశారు. ప్రవేశానికి iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈనెల 16వ తేదీ సాయంత్రం 2గంటల్లోపు అభ్యర్థి ఏ కళాశాలలో చేరాలో ఆ ఐటీఐలను తప్పనిసరిగా ఆన్‌లైన్ ఆప్షన్‌లో ఎంపిక చేసుకోవాలన్నారు. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ విడతల్లో ఐటీఐ సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా ప్రవేశానికి ఐదవ విడతలో మరలా కొత్త రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులంతా దగ్గరలోని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ఈనెల 16వ తేదీ సాయంత్రం 4గంటల్లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని లేకుంటే కౌన్సెలింగ్‌కు అర్హులు కాదని వేణుగోపాలరావు తెలిపారు. మరిన్ని వివరాలకు 0884 2348182, 94404 08182 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఈ నెల 17న తేదీ ఉదయం 8గంటల నుంచి ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి కౌన్సిలింగ్ ఉంటుందన్నారు.

కొవ్వూరు నుంచి వేములూరు-నిడదవోలుకు ఆర్టీసీ బస్సు నడపాలి



కొవ్వూరు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొవ్వూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డిపో నుంచి మెయిన్‌రోడ్, వేములూరు, తోగుమ్మి గ్రామాల మీదుగా నిడదవోలుకు ఆర్టీసీ బస్సు నడపాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో నాయకులు కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. నాగేంద్రమాట్లాడుతూ కొవ్వూరులో ఆర్టీసీ డిపో ఉన్నప్పటికీ నియోజకవర్గంలో కొన్ని రూట్లలో ఆర్టీసీ సేవలు అందక గ్రామీణప్రాంత ప్రజలు ప్రైవేటు వాహనాలపై ఆధారపడి అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకాన్ని అమలుచేస్తున్నా వేములూరు, తోగుమ్మి, నందమూరు, పశివేదల, ఆరికిరేవుల, కుమారదేవం, దిడిపి గ్రామాలలో బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, మహిళలు, వ్యాపారులు, విద్యార్థులు బస్సుసౌకర్యం లేక ప్రయాణాలకు ప్రైవేటు వాహనాలపై ఆధారపడి ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల సౌకర్యం కొవ్వూరునుంచి మెయిన్‌రోడ్‌మీదుగా వేములూరు, తోగుమ్మి మీదుగా నిడదవోలు, కొవ్వూరు నుంచి ఆరికిరేవుల, కుమారదేవంమీదుగా గోదావరి ఏటిగట్టు రోడ్‌పై తాళ్లపూడి, పోలవరంవరకు ఆర్టీసీబస్సు సర్వీసులను నడపాలని డిమాండ్ చేశారు.